1st Happy Work Anniversary. Year

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు　　తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2　సంచిక : 48　ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్　శనివారం 22 ఫిబ్రవరి 2025　పేజీలు 8　: వెల 5/-　ఒంగోలు

VOLUME : 02　ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE　Saturday 22 February 2025 PAGES : 8 PRICE : 5/-

# ఇక ఫుల్ టైమ్ పొలిటిక్సేనా

- సినిమాలు చేయడానికి సిద్ధంగా లేరన్న వార్తలు ఆయన ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి
- ఇప్పటి వరకూ ఒప్పందం చేసుకున్న సినిమాలను ఎలాగోలా పూర్తి చేసి పూర్తి స్థాయి రాజకీయాలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది
- కసితో రాజకీయాలకు వచ్చిన పవన్ కల్యాణ్ దానినే ప్రధానంగా ఎంచుకోవవాలని నిర్ణయించుకున్నారు
- రెండు పడవల మీద కాలు మోపేకంటే ఒకదానిలో ఉండి లక్ష్యాన్ని చేరడం కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు.



**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి రాజకీయాలకే పరిమితమయ్యేటట్లే కనిపిస్తుంది. ఆయన ఇకపై సినిమాలు చేయడానికి సిద్ధంగా లేరన్న వార్తలు ఆయన ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటి వరకూ ఒప్పందం చేసుకున్న సినిమాలను ఎలాగోలా పూర్తి చేసి పూర్తి స్థాయి రాజకీయాలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆరోగ్యం కూడా ఇబ్బంది పెడుతుంది. సరైన సమయంలో తిండి లేకపోవడం, నిద్రలేమి వంటి వాటితో తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. కానీ కసితో రాజకీయాలకు వచ్చిన పవన్ కల్యాణ్ దానినే ప్రధానంగా ఎంచుకోవవాలని నిర్ణయించుకున్నారు. రెండు పడవల మీద కాలు మోపేకంటే ఒకదానిలో ఉండి లక్ష్యాన్ని చేరడం కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల - మిగతా 3లో



## 'మద్దతు ధర ఆలోచన అప్పుడే ఎందుకు చేయలేదు?'

- మిర్చి యార్డుకు వెళ్లడం ఇల్లీగల్ యాక్టివిటీ అయితే... మ్యూజికల్ నైట్ కు వెళ్లడం ఏ యాక్టివిటీ?: బొత్స
- కూటమి ప్రభుత్వానికి రైతులంటే గౌరవం లేదన్న బొత్స
- జగన్ పర్యటన తర్వాతే మిర్చి రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలిశాయని వ్యాఖ్య
- షర్మిల వ్యక్తిగత అజెండాతో మాట్లాడుతున్నారని విమర్శ

**విశాఖ**

కూటమి ప్రభుత్వానికి రైతులన్నా, వ్యవసాయమన్నా గౌరవం లేదని వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. తమ అధినేత జగన్ నేరుగా మిర్చి యార్డుకు వెళ్లి మిర్చి రైతులు పడుతున్న ఇబ్బందిని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. జగన్ పర్యటన తర్వాతే మిర్చి రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలిశాయని చెప్పారు. జగన్ వెళితే కానీ మిర్చి రైతుల సమస్యలు ప్రభుత్వానికి తెలియలేదా? అని ప్రశ్నించారు. మిర్చి రైతులకు మద్దతు ధర - మిగతా 3లో



## జమ్మూకశ్మీర్‌పై ఎర్డోగాన్ వ్యాఖ్యలు అనుచితం

- భారత్ తీవ్ర అభ్యంతరం
- ఎర్డోగాన్ వ్యాఖ్యలు అనుచితం
- ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ఎర్డోగాన్ వ్యాఖ్యలపై టర్కీ అంబాసిడర్‌కు భారత్ తీవ్ర నిరసన
- జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగం
- భారత్‌కు వ్యతిరేకంగా చొరబాట్లు, సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ ప్రేరేపిస్తోంది



## భారత్‌కు అమెరికా సాయం.. బంగ్లాకు మళ్లిందా?

- అమెరికా 21 మిలియన్ డాలర్ల సాయం.. కొత్త మలుపు
- ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో బీజేపీ-కాంగ్రెస్‌లు పరస్పరం విమర్శలు గుప్పించుకుంటున్న సంగతి తెలిసిందే.
- ఆ సాయాన్ని బంగ్లాదేశ్‌కు మళ్లించారంటూ ఓ జాతీయ మీడియా సంస్థ నుంచి కథనం




## టెస్లా కంపెనీ కోసం రాష్ట్రాలు పోటీ

- టెస్లా ఇండియాలో వ్యాపారం ప్రారంభించబోతోంది
- ముందుగా కార్లు దిగుమతి చేసుకుని అమ్మబోతోంది
- 2026 నాటికి దేశవ్యాప్తంగా 5,000 రీస్టోర్ బ్రాండ్ స్టోర్‌లను ప్రారంభించాలని యోచిస్తోంది
- త్వరలో ప్లాంట్ పెట్టేందుకు ఎలాన్ మస్క్ నిర్ణయించారు.
- టెస్లా ప్లాంట్ కోసం.. నాలుగైదు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి
- ఈవీ పాలసీలు మెరుగ్గా ఉన్న పలు రాష్ట్రాల విషయంలో టెస్లా ఆసక్తి చూపిస్తోంది

## యూఎస్ఏఐడీ నిధుల వ్యవహారం కలవరపెడుతోంది

- "యూఎస్ఏ కార్యకలాపాలు, ఫండింగ్‌కు సంబంధించి యూఎస్ అడ్మినేషన్ పేర్కొన్న విషయం మా దృష్టికి వచ్చింది
- ఇది తీవ్రంగా కలవరచే అంశం
- ఇది భారతదేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం కిందకే వస్తుంది
- ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్



# కో ఆప్టెక్స్‌తో ఆప్కో ఒప్పందం

- ఏపీ, తమిళనాడు మంత్రులు సవిత, గాంధీ సమక్షంలో ఎంవోయూ
- పెరిగిన మార్కెట్ తో ఏపీ చేనేత కార్మికులకు ప్రయోజనం



**విజయవాడ**

రాష్ట్రంలోని చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించే లక్ష్యంలో భాగంగా మరో కీలక ముందుడగు పడింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో, కో ఆప్టెక్స్ ఏజెన్సీలు తమ షోరూమ్ ల్లో రెండు రాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా ఒప్పందం కుదురింది. ఈ ఏడాది రూ.9.20 కోట్ల మేర వస్త్రాలు విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ మేరకు విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో శుక్రవారం జరిగిన బయ్యర్, సెల్లార్ మీట్ లో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్రంలోని చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధితో పాటు చేనేత ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెట్ సదుపాయం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ నగరాల్లో ఆప్కో ఆధ్వర్యంలో చేనేత ఎక్స్ పోలు, ఎగ్జిబిషన్లు నిర్వహిస్తూ వస్తోంది. చేనేత కార్మికులకు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా డిజైన్లు, దుస్తుల తయారీపై శిక్షణ ఇస్తూ, తయారైన చేనేత వస్త్రాలకు మరింత మార్కెట్ సదుపాయం కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఇతర రాష్ట్రాల చేనేత సంస్థలతో కూడా ఒప్పందాలు కుదుర్చుకోవాలని - మిగతా 3లో

# నెట్‌వర్క్‌ను పెంచలేదు

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో ఏపీ ఫైబర్ నెట్ అధికారుల భేటీ
- దినేష్ కుమార్ ఐఏఎస్ ఒక్క రోజు కూడా నెట్‌వర్క్‌ను పెంచే ప్రయత్నం చేయలేదు
- వ్యూహం సినిమా విషయంలో నోటీసు ఇస్తే నేటికీ సమాధానం లేదు
- రెండు రోజుల్లో తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలతో వివరణ ఇస్తామని జీవీ రెడ్డి స్పష్టం



**అమరావతి**

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో ఏపీ ఫైబర్ నెట్ అధికారులు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీ కాసేపటి క్రితమే ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని మంత్రి కార్యాలయ అధికారులు లేఖ రాశారు. రెండు రోజుల్లో తన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలతో వివరణ ఇస్తామని జీవీ రెడ్డి స్పష్టం చేశారు. ఎండీ దినేష్ కుమార్‌ను సైతం వివరణ ఇవ్వాలని మంత్రి జనార్దన్ రెడ్డి కోరారు. రేపు సాయంత్రానికి వివరణ ఇవ్వాలని దినేష్ కుమార్‌ను ఆదేశించారు. ఇరువైపులా వివరణలు వచ్చాక వాటి ఆధారంగా ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. కాగా.. ఏపీ ఫైబర్ నెట్ ఎండీ దినేష్ కుమార్ - మిగతా 3లో

# కో ఆప్టెక్స్‌తో ఆప్కో ఒప్పందం

-మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. రాష్ట్రంలోని చేనేత వస్త్రాలకు మార్కెట్ విస్తరణలో భాగంగా తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తో ఆప్కో ఒప్పందం చేసుకుంది. ఏపీ, తమిళనాడుకు చెందిన చేనేత,జౌళిశాఖ మంత్రులు సవిత, గాంధీ సమక్షంలో ఆప్కో ఎండీ పావనమూర్తి, కో ఆప్టెక్స్ ఎండీ దీపక్ జాకబ్ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. ఇరు రాష్ట్రాలకు చేనేత సంస్థలు రూ.9.20 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందంతో తమిళనాడు కు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. కో ఆప్టెక్స్, ఆప్కో మధ్య రూ.20 లక్షలు, ట్రిచీ, మదురై, తిరుచెన్ గోడ్ సర్కిల్, అరబిందో టెక్స్ టైల్స్ మధ్య రూ.1.25కోట్లు, సాలెమ్ సర్కిల్, శ్రీ సుదర్శన్ సిల్క్ మధ్య రూ.కోటి, ఈరోడ్ సర్కిల్, బళభద్ర నర్సింహా మూర్తి సంస్థ మధ్య రూ.50 లక్షల మేర ఒప్పందం కుదిరాయి. వాటితో మరిన్ని ఏపీ, తమిళనాడుకు చెందిన సంస్థల మధ్య ఒప్పందాలు కుదిరియి. త్వరలో మిగిలిన రాష్ట్రాలకు చెందిన చేనేత సంస్థలతోనూ ఒప్పందం చేసుకోడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆప్కో, కో ఆప్టెక్స్ ఒప్పందంతో ఏపీకి చెందిన చేనేత కార్మికులకు ఎంతో లబ్ధి కలుగనుంది. నేతన్నల దగ్గర తయారవుతు న్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తోంది. కో ఆప్టెక్స్ కు చెందిన చేనేత వస్త్రాలు డబుల్ క్లాత్ బెడ్‌షీట్‌లు (కింగ్ సైజు), టర్కీ టవల్స్ (బ్లీచ్డ్, డైడ్), డోర్‌మ్యాట్‌లు, ఆరని సిల్క్ చీరలు, పళని టై, డై చీరలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీకి చెందిన మంగళగిరి కాటన్, జరీ చీరలు, రాజమండ్రి కాటన్ చీరలు, బందర్ కాటన్ చీరలు, వెంకటగిరి కాటన్ చీరలు,



మాధవరం కాటన్ చీరలు, సిల్క్ చీరతో పాటు ఇతర చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ ల్లో విక్రయిస్తారు. ఏపీతో పాటు తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న కో ఆప్టెక్స్ షో రూమ్ లో రాష్ట్రానికి చేనేత వస్త్రాలను విక్రయించుకునే సౌలభ్యం కలుగుతుంది. దీనివల్ల ఉత్పత్తవుతున్న సరకును ఎప్పటికప్పుడు అమ్మకం కావడం వల్ల నేతన్నలకు ఆర్థికంగా ఎంతో లబ్ధి కలుగుతుంది. చేనేతలకు 365 రోజుల పాటు పని కల్పించాలన్న లక్ష్యంగా కూడా నెరవేరబోతోంది.

**తమిళనాడు బయ్యర్-సెల్లార్ మీట్ ను ప్రారంభించిన మంత్రి సవిత**

విజయవాడలోని ఓ ప్రైవేటు హెూటల్ లో తమిళనాడు ప్రభుత్వం నిర్వహించిన బయ్యర్, సెల్లార్ మీట్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా హెూటల్ లో తమిళనాడు ప్రభుత్వం కో ఆప్టెక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆ రాష్ట్ర మంత్రి ఆర్.గాంధీతో కలిసి పరిశీలించారు. చీరలు, ఇతర చేనేత వస్త్రాలను నాణ్యతను, ధరలను మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన చేనేత, జౌళి శాఖ కార్యదర్శి వి.అమృతవల్లి, డైరెక్టర్ మేఘాశ్వేరి రవికుమార్, ఏపీ చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు, చేనేత సొసైటీలు, పలు వాణిజ్య సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# నెట్‌వర్క్‌ను పెంచలేదు..

-మొదటిపేజీ తరువాయి

ఐఏఎస్‌పై ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో అన్ని శాఖల్లో పురోగతి ఉందని.. ఫైబర్ నెట్‌లో ఎలాంటి పురోగతి లేదని మండిపడ్డారు. గతంతో పోలిస్తే ఈ సంస్థ ద్వారా ప్రభుత్వానికి ఒక్క రూపాయి ఆదాయం కూడా ఎందుకు రాలేదని నిలదీశారు. ఈ తొమ్మిది నెలల్లో ఒక్క కనెక్షన్ కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 78 వేల కిలోమీటర్ల ఆప్టిక్ ఫైబర్ ఉందని... ప్రతిరోజూ ఏదో ఒక సమస్య వస్తూనే ఉందని చెప్పారు. ఫైబర్ నెట్ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని జీవీరెడ్డి ధ్వజమెత్తారు.

**నెట్‌వర్క్‌ను పెంచలేదు..**

దినేష్ కుమార్ ఐఏఎస్ ఒక్క రోజు కూడా నెట్‌వర్క్‌ను పెంచే ప్రయత్నం చేయలేదని.. అలాంటప్పుడు కనెక్టన్‌లు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. గత మేనేజ్‌మెంట్‌తో కలిసి ఏమైనా కుట్ర ఉంది అని అనుకోవాలా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. సమస్యలు ఎక్కడైనా వస్తాయని.. అయితే ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. ఏంటిది ఐఏఎస్ దినేశ్ కుమార్ అంటూ మండిపడ్డారు. విధుల్లో అలసత్వం వహించవద్దని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నారని.. కానీ ఇక్కడ మాత్రం అసలు మొదలే పెట్టలేదని వ్యాఖ్యలు చేశారు.

**వారిని తొలగించాల్సిందే...**

ఎండీగా దినేష్ కుమార్ ఉన్నప్పటికీ ఆయనకు చేదోడు వాదోడుగా ఉంటూ బిజినెస్‌ను ఒక్క అడుగుకూడా ముందుకు వెళ్లకుండా ముగ్గురు వ్యక్తులు చేస్తున్నారని ఆరోపించారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ సత్యరామ్ భరద్వాజ్ , బిజినెస్ అడ్వైజర్ సురేష్ , ప్రొక్యూర్మెంట్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శశాంక్ హైదర్ ఖాన్.. వీరి ముగ్గురిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు ఏం చేసినా తదుపరి చర్యలు చాలా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో డిసెంబర్ 24న ప్రెస్‌మీట్ పెట్టిన సమయంలో 410 మంది ఇర్రెగ్యులర్ ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించానని తెలిపారు. తాను ఇర్రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే తొలగించాలని చెప్పినట్లు తెలిపారు. అయితే నేటికీ కూడా ఒక్క ఉద్యోగిని కూడా తొలగిస్తున్నట్లు అధికారిక ఉత్తర్వులు ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు వాళ్లకు కోటిన్నర జీతం పని చేయకుండా ఇవ్వాలన్నారు. ఎండీకి వారిని తొలగించడానికి భయం ఏంటి అంటూ ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి ప్రశ్నించారు.

**అకౌంట్స్ అడిగితే చూపించరా..**

వ్యూహం సినిమా విషయంలో నోటీసు ఇస్తే నేటికీ సమాధానం లేదన్నారు. చైర్మన్‌కు బుక్స్ ఆఫ్ అకౌంట్స్ అడిగితే చూపించరా అని ప్రశ్నించారు. ఏనుగులా ఉండే ఏపీ ఫైబర్ నెట్‌ను పీనుగులా చేశారని మండిపడ్డారు. చివరకు అధికారులు శవాలపై పేలాలు ఏరుకోవాలని చూస్తున్నారన్నారు. 2000 కోట్ల రూపాయల టర్నోవర్ చేయదగ్గ సంస్థ ఇది అని తెలిపారు. అవినీతి వేరు... ద్రోహం వేరన్నారు. పాకిస్థాన్ మాట విని మన అధికారులు ఆయుధాలు కొనకపోతే అది ద్రోహం కిందకు వస్తుందని.. ఏపీ ఫైబర్ నెట్‌లో జరిగేది ఇదే అని అన్నారు. ప్రజలు కట్టే పన్నులు అంటే లెక్కలేనితనం ఇది అని వ్యాఖ్యలు చేశారు.

**విజిలెన్స్ విచారణ**

"కేబుల్ ఆపరేటర్‌లు కొత్త కనెక్షన్‌లకు పర్మిషన్ ఇవ్వమని అడిగితే ఏం చేశారు. వారిని కనీసం లోపలికి కూడా పిలవడం లేదు. మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, సీఎం చంద్రబాబు పెట్టిన శ్రద్ధ కూడా మా అధికారులు ఈ సంస్థపై పెట్టడం లేదు. నేను వచ్చాక విజిలెన్స్ ఎంక్వయిరీకి సహకరించాలని సర్క్యూలర్ ఇచ్చాను. మా ఎండీ ఒక్కసారి అయినా విజిలెన్స్ వాళ్లకు కనిపించారా, వారితో మాట్లాడారా. జీవీ రెడ్డి చెప్పిన తరువాత కూడా జీతాలు ఇస్తున్నారు అని ఎవరైనా పత్రికల్లో రాస్తారు అనే నేను ఈ ప్రెస్‌మీట్ పెట్టాను. నేను చేయగలగడమా.. వెళ్ళిపోవడమా చూడాలి. ఈ సంస్థ దివాలా అంచున ఉంది. 600 కోట్లు ప్రజలు డబ్బులు ఈ సంస్థలో వున్నాయి. అధికారులు 10:45 గంటలకు వచ్చి 5 గంటలకు వెళ్ళిపోతే ఎలా... కనీసం ఓనర్ షిప్ తీసుకోరా" అంటూ ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి ప్రశ్నించారు.

# పవన్ పై ఉండవల్లి కొత్త ప్రేమ

**రాజమండ్రి :** మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ రాజకీయ సన్యాసం చేశారు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. అయితే ఆయన మాత్రం రాజకీయంగా దూరమయినా రాజకీయ సూచనలు చేయడం మాత్రం ఆపుకోలేకపోతున్నారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు కూడా తరచూ మీడియా సమావేశాల్లో పాల్గొనేవారు. ప్రధానంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో పాటు రాష్ట్ర విభజన హామీలు, మార్గదర్శి చిట్ ఫండ్ సంస్థ ఇలా అనేక అంశాలపై మీడియా సమావేశాలు పెట్టి మాట్లాడేవారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన పెద్దగా మాట్లాడటం లేదు. అధికారంలోకి వచ్చి తక్కువ రోజులే కావడంతో పెద్దగా స్పందించడం లేదన్నది ఆయన సన్నిహితుల వాదన,2004 నుంచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవించి ఉన్నంత వరకూ ఉండవల్లి అరుణ్ కుమార్ ఒకవెలుగు వెలిగారు. రెండుసార్లు రాజమండ్రి పార్లమెంటు సభ్యుడిగా గెలిచారు. వైఎస్ ఆయన సలహాలు స్వీకరించేవారు. వైఎస్ ఆత్మ కేవీపీ రామచంద్రరావు కూడా ఉండవల్లితో చర్చించి ముఖ్యమైన నిర్ణయాలను వైఎస్ కు చేరవేసేవారు. ఉండవల్లి అరుణ్ కుమార్ సలహాలు తీసుకుంటున్నారంటే అందుకు కారణం ఆయన న్యాయవాది కూడా అవ్వడం కారణం. జక్కంపూడి రామ్మోహన్ రావు సాన్నిహిత్యంతో రాజకీయ రంగంలోకి కాలుమోపిన ఉండవల్లి అరుణ్ కుమార్ తర్వాత కాంగ్రెస్ లో కీలకంగా మారారు. అలాంటి ఉండవల్లి అరుణ్ కుమార్. వైఎస్ తనయుడు వైఎస్ జగన్ కూడా ఆయనను సంప్రదించలేదు. జగన్ మైండ్ సెట్ వేరు. ఇక చంద్రబాబుకు ఉండవల్లి అరుణ్ కుమార్ కు మధ్య వైరుధ్యాలున్నాయి. అందుకే ఆయన ఈ మధ్య కాలంలో



పవన్ కల్యాణ్ ను ప్రశంసించడం మొదలు పెట్టారంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పవన్ కల్యాణ్ ఆశాజ్యోతి అంటూ కీర్తించారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ నేతల్లో పవన్ కల్యాణ్ చాలా డిఫరెంట్ నాయకుడని ఉండవల్లి అన్నారంటే దువ్వుతున్నట్లే కనిపిస్తుంది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే రాజకీయాల్లో మనలేమన్న విషయం పవన్ కల్యాణ్ కు తెలుసునని, కానీ, పవన్ కల్యాణ్ ఉన్నది ఉన్నట్టు మాట్లాడి అందరినీ మెప్పిస్తున్నారని ఉండవల్లి అన్నారంటే అందులో లోతైన అర్థముందని చెబుతున్నారు. ఉండవల్లి అరుణ్ కుమార్ కు బీజేపీ అంటే పడదు. బీజేపీ పొత్తుతో పవన్ ఉన్నారు. అయినా సనాతన ధర్మం అంటూ కాషాయవస్త్రాలు నిరంతరం ధరించే పవన్ కల్యాణ్ ను ప్రశంసిస్తున్నారంటే ఏదో పరమార్థం ఉండి ఉంటుందన్నది అనుకోక తప్పదు. అయితే ఉండవల్లి అరుణ్ కుమార్ రాజకీయాల్లోకి తాను రానని చెబుతున్నారు. అంత అవసరం కూడా తనకు లేదంటున్నారు. అంతవరకూ బాగానే ఉంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం మాత్రమే ఉండవల్లి మాట్లాడుతుంటారని చెబుతున్నారు. వినే నేత పవన్ కల్యాణ్ ఒక్కడే కావడంతో ఆయనతో తన మనసులో మాట చెప్పుకోవడానికే ఉండవల్లి ఈ రకమైన కామెంట్స్ చేసినట్లు అర్థమవుతుందన్నారు. మొత్తం మీద పవన్ అయినా తన హితోక్తులు వినకబోతారా? అన్న ఆశతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లు కనపడుతుంది.

## 'మద్దతు ధర ఆలోచన అప్పుడే ఎందుకు చేయలేదు?'

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వాలనే ఆలోచన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మిర్చి రైతులను పరామర్శించే వరకూ మీరు స్పందించ లేదంటే ఏమనుకోవాలని బొత్స నిలదీశారు.'కేంద్ర మంత్రి ఢిల్లీ లో లేనప్పుడు మిర్చి రైతుల కోసం చర్చించడానికి వెళుతున్నామని చెప్పడం ఎంత వరకు సమంజసం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మిర్చి యార్డ్ కు వెళ్ళిన తర్వాత మిర్చి రైతుల ఆవేదన ఈ ప్రభుత్వానికి తెలిసింది. మిర్చి రైతుల సమస్యలను తెలుసుకోవడానికి జగన్ వెళితే... ఆ పర్యటనను ఇల్లీగల్ యాక్టివిటీ అంటున్నారని మండిపడ్డారు. మరి మ్యూజికల్ నైట్ కు వెళ్లడం ఏ యాక్టివిటీ అవుతుందని ప్రశ్నించారు. మిర్చి యార్డుకు వెళ్లవద్దని ఎన్నికల కమిషన్ చెప్పలేదని అన్నారు.

కోడి కత్తి కేసులో జగన్ హాజరుకాకపోతే కోర్టు నిర్ణయం తీసుకుంటుందని బొత్స చెప్పారు. భూ కుంభకోణాలపై వేసిన సిట్ నివేదికను ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల వ్యక్తిగత అజెండాతో మాట్లాడుతున్నారని... రాజకీయాల్లో వ్యక్తిగత అజెండాలకు తావు లేదని చెప్పారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైసీపీ దూరంగా ఉందని తెలిపారు.

మద్దతు ధర ఇవ్వాలనే ఆలోచన రెండు నెలల క్రితమే ఎందుకు చేయలేదు..రైతులు, వ్యవసాయం దండగ అనే భావన చంద్రబాబు మనసులో ఇంకా పోలేదు. మిర్చి రైతులను కలవడానికి జగన్మోహన్ రెడ్డి వెళ్లడం ఇల్లీగల్ యాక్టివిటీ అయితే అట్టహాసంగా విజయవాడలో జరిగిన మ్యూజికల్ నైట్ లీగల్ అవుతుందా...? .విశాఖలో జరిగిన భూ కుంభకోణాల పై విచారణ నివేదికల ను బహిర్గతం చెయ్యాలి. బురదజల్లడం కాదు ఆరోపణలు నిరూపించాలి...ఆ బాధ్యత ప్రభుత్వానిదే. జెడ్ కేటగిరీలో వున్నమాజీ ముఖ్యమంత్రి భద్రత ఎందుకు కుదిరించారు అని గవర్నర్ ఆశ్చర్య పోయారు. జగన్ భద్రత తనకు సంబంధం లేదని చెబుతున్న ముఖ్యమంత్రి.....మిర్చి యార్డ్ సందర్శనకు వెల్లడం ఇల్లీగల్ అని ఎలా చెబుతారు' అని బొత్స సూటిగా ప్రశ్నించారు.

## ఇక ఫుల్ టైమ్ పాలిటిక్సేనా

-మొదటిపేజీ తరువాయి

ఒక దర్శకుడు పవన్ కల్యాణ్ తో సమావేశమై కథ వినిపించడానికి సిద్ధమవ్వగా అందుకు పవన్ సున్నితంగా తిరస్కరించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. తాను ఇకపై సినిమాలు చేయదలచుకోలేదని, ప్రస్తుతం తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్నానని, ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి ఉన్నందున సినిమాలకు ఇకపై సంతకం చేయనని చెప్పినట్లు తెలిసింది. పవన్ సన్నిహితుడు తివిక్రమ్ కూడా ఈ విషయాన్ని తన సన్నిహితుల వద్ద చెప్పడంతో ఇందులో నిజముందని అనుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఏపీ ప్రజలు తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, తాను రాజకీయాల్లో ఎదిగి తిరిగి ఓడి వెనుదిరగడానికి పవన్ ఇష్టపడటం లేదు. జనసేన పార్టీ పెట్టినప్పుడే తాను ఇరవై ఐదేళ్లు రాజకీయాలు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు పవన్ కల్యాణ్. అనుకున్నట్లుగానే పదో ఏడాది ఆయన ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. అయితే తాను అనుకున్న పనులన్నీ పూర్తి చేయలేకపోతున్నారు. ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీలతో పాటు కొన్ని కీలక, సున్నిత అంశాలను కూడా పరిష్కరించడానికి ఆయన సతమతమవుతున్నారు. రాష్ట్ర ఖజానాలో నిధులు లేకపోవడంతో ప్రభుత్వంపై కూడా ఆయన వత్తిడి తేలేకపోతున్నారు.. ప్రధానంగా యువతకు తాను ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతున్నాననే బాధ అయనలో కనపడుతుందంటున్నారు. ముఖ్యంగా ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారికి పది లక్షల రూపాయల వరకూ రుణం మంజూరు చేసేదానిపైనా కూడా ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారు. దీంతో అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతుండటం, భోజనం చేసే సమయం కూడా లేకపోవడంతో ఆయన అనారోగ్యం పాలవుతున్నారు. జ్వరం, స్పాండిలైటిస్ తో బాధపడుతూ ఆయన ఇటీవల పుష్కర స్నానానికి వెళ్లిన ఫొటోలతో పవన్ బాడీ షేమింగ్ కూడా సోషల్ మీడియాలో గురయ్యారు. దీంతో? ఆయన పూర్తిగా సినిమాలకు స్వస్తి చెప్పాలన్న నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. నిజంగా ఇది పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ కు బ్యాడ్ న్యూస్.

## ఈ చెట్టు 33 లక్షలట...

**రాజమండ్రి :** దేశ విదేశాలకు చెందిన విభిన్న మొక్కలతో కనువిందు చేసే కడియం నర్సరీలో ఏదో ఓ ప్రత్యేకత కనిపిస్తూనే ఉంటుంది.. అందుకే భారత కుబేరుడు ముఖేష్ అంబానీ అంతటి వాడే నేరుగా తన వారిని కడియం పంపించి తాను గుజరాత్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పార్కులో ఇక్కడి నుంచే లక్షల రూపాయలు వెచ్చించి మొక్కలను తీసుకెళ్లారు... ఒకప్పుడు దేశీయ జాతులకు చెందిన మొక్కలను అభివృద్ధి చేసే పద్ధతి నుంచి మరికొన్నాళ్లకు విదేశీజాతుల మొక్కలను కడయం నర్సరీల్లోనే అభివృద్ధి చేసే స్థాయికి చేరుకున్నారు ఇక్కడి రైతులు. విభిన్నంగా ఆలోచించి ఏకంగా విదేశాల్లో వందేళ్ల వయసున్న మొక్కలను ప్రత్యేక కంటైనర్లు ద్వారా ఇక్కడికి రప్పించి అంతర్జాతీయ స్థాయి నర్సరీ మార్కెట్‌తో పోటీపడుతున్నారు.. ఇదిలా ఉంటే కడియం నర్సరీలో ఇప్పుడు ఓ అరుదైన ఏళ్లనాటి చెట్టు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది.. ఎన్నో వెరైటీ బోన్సాయ్ మొక్కలను అభివృద్ధి చేసి నర్సరీల నిండానింపిన అనుభవం ఉన్న కడియం నర్సరీ రైతులు తాజాగా తీసుకువచ్చిన భారీ ఆకారంగల బోన్సాయ్ చెట్లతో వృక్ష ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలోని కడియంలో శ్రీ శివాంజనేయ నర్సరీ రైతు మల్లు పోలరాజు మూడు రోజుల క్రితం విదేశాల నుంచి వీటిని తీసుకొచ్చిన చెట్లు ఇప్పుడు అందరినీ ప్రత్యేకంగా ఆకర్షిస్తోంది.. భారీ ఆకారంలో కలసాన్ని పోలి ఉన్న ఈ భారీ వృక్షాలు అందర్నీ అబ్బుర పరుస్తున్నాయి. ఈ చెట్టును "సిల్క్ ఫ్లోస్ ట్రీ అని పిలిచే దీని శాస్త్రీయ నామం. వీటిని ప్రత్యేక కంటైనర్ ఉంచి 75 రోజుల క్రితం షిప్ లో వేస్తే చెన్నై నుంచి ఇక్కడికి తీసుకువచ్చారు. దక్షిణ అమెరికా దేశంలో విరివిగా ఉండే ఈ మొక్కలను స్పెయిన్, థాయిలాండ్ వంటి దేశాల్లో విక్రయాలు చేపడుతున్నారు. పెద్దపెద్ద పార్కులు, హెూటల్స్, ధనవంతుల గార్డెన్స్ లోనూ వీటిని ప్రత్యేక ఆకర్షణ కోసం పెంచుకుంటుంటారని నర్సరీ యజమాని తెలిపారు. ఈ చెట్టు వయసు వంద నుంచి నూట ఇరవై ఏళ్లు ఉంటుందని చెప్పారు.. కడియం నర్సరీలో ఉన్న ఈ చెట్లు ఇటీవలే హైదరాబాద్‌లోని చిలుకూరు సమీపంలో నిర్మించిన ఎక్స్‌పీరియం లో ఉన్నాయట.. సాధారణంగా బోన్సాయ్ మొక్కలు అంటేనే చాలా ఖరీదైనవిగా చెబుతుంటారు. ఇంత ఖరీదు ఎందుకు అంటే ఏళ్ల తరబడి వీటిని ఓ ప్రత్యేక రూపంలోకి మల్లించేందుకు చాలా ప్రయాస పడుతుంటారు. అంతేకాకుండా కొన్ని ప్రత్యేక వాతావరణంలో కూడా వీటిని కాపాడుకోవాల్సి ఉంటుంది.. కావాల్సిన ఆకృతిలోకి మళిచేందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది.. అయితే ఇప్పుడు కడియం నర్సరీలో దర్శనమిస్తున్న ఈ అరుదైన వృక్షం సొంతం చేసుకోవాలంటే మాత్రం కళ్లు బైర్లు కమ్మాల్సిందే.. ఈ అరుదైన చెట్లు విషయానికి వస్తే ఒక్కొక్కటి రూ.35 నుంచి 40 లక్షలు ఉంటాయి.కాగా, నర్సరీలో ఉన్న ఈ చెట్టు ధర రూ.33 లక్షలు అని నర్సరీ యజమాని తెలిపారు. ప్రస్తుతం మోడులుగా కనిపిస్తున్న వీటికి చిన్నచిన్న కొమ్మలు వచ్చి రంగురంగుల పువ్వులు పూస్తాయి. అప్పుడు మరింత శోభాయమానంగా నీ మొక్కలు సందర్శకులను అలరిస్తాయి. ప్రపంచ నర్సరీ రంగంలో ఏమాత్రం తీసి పోమని చాటి చెప్పడానికే వీటిని ఇక్కడకు తీసుకొచ్చినట్లు నర్సరీ రైతు మల్లు పోలరాజు తెలిపారు.

## వైసీపీకి సేనాని సెగ...
## పవన్ పై కామెంట్స్ కు దూరం

**విజయవాడ :** ఎన్నికల్లో అంత ఘోరంగా ఓడడానికి కారణాలేంటని విశ్లేషించుకుంటున్న టైమ్‌లో ఆ ఒక్కడి జోలికి వెళ్లకుంటే బాగుండేదని..నేతల తమ మనోగతం బయటపెట్టారట. పవన్‌ను పర్సనల్‌గా అటాక్ చేయడం వల్లే కాపులు తమకు దూరమయ్యారని భావిస్తున్నారట వైసీపీ నేతలు. సేనానిని విమర్శించడం వల్ల యూత్ ఓట్లు కూడా తమకు పోలరైజ్ కాలేదని అనుకుంటున్నారట. పలువురు నేతల సూచనల ప్రభావమో..లేక వైసీపీ అధినేతే వాస్తవాలను గమనించారో తెలియదు కానీ..సేనాని జోలికి మాత్రం వెళ్లడం లేదంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు పవన్ లక్ష్యంగా మాటల తూటాలు పేల్చేవారు వైసీపీ నేతలు.



## రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియాకు స్వాగతం పలికిన కలెక్టర్, అధికారులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా శుక్రవారం ఒంగోలు వచ్చారు. నగరంలోని కెవి హెూటల్‌లో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, (తరువాయి 4లో...)

షణ్ముఖ వెలుగు ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక ప్రకాశం

# గ్రూప్ 2 మెయిన్స్ రాత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా
- పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు
- ఎస్పీ ఏఆర్ దామోదర్
- పరీక్ష నియమ నిబంధల ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

గ్రూప్ 2, ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఫీజులు, హాల్ టికెట్ల పరంగా యాజమాన్యాలు ఎక్కడైనా ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు.

### సకాలంలో చేరుకోవాలి...

ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ 2 మెయిన్సు పరీక్షలు జిల్లాలోని 7 సెంటర్లలో ఈ నెల 23 వ తేదీన జరుగనున్నాయన్నారు. ఉదయం, మధ్యాహ్నం సమయాలలో జరిగే ఈ పరీక్షలలో 4,544 మంది అభ్యర్థులు హాజరు కాబోతున్నారని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేసారన్నారు. ఒంగోలు, నగర శివారులోని క్విస్ కాలేజీ, నాగార్జున డిగ్రీ కాలేజీ, శ్రీహర్షిని డిగ్రీ, పీజీ కాలేజీ, రైస్ కాలేజీ, పేస్ కాలేజీలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, ఇందుకోసం 8:30 నుంచి 9:30 వరకు అభ్యర్థులను అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం పరీక్ష మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుందని, ఇందుకోసం మధ్యాహ్నం 1:30 నుంచి 2:30 గంటల వరకు అభ్యర్థులు అనుమతిస్తామని కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ పరీక్షలకు 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందన్నారు. పరీక్ష నిడివి రెండున్నర గంటలు అని చెప్పారు. జిల్లాలో ఈ పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించేందుకు జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ కోఆర్డినేటింగ్ ఆఫీసరుగా ఉంటారని, మరో ఏడుగురు జిల్లాస్థాయి అధికారులను లైజనింగ్ ఆఫీసర్లుగా నియమించామని కలెక్టర్ తెలిపారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వేటినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక వస్థలను ఆయా పరీక్ష కేంద్రాలలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. దివ్యాంగులు, గర్భిణులు గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అభ్యర్థులందరూ హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ఫోటో గుర్తింపు కార్డును తీసుకురావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలో, పరీక్ష రాసే సమయంలో అనుచితంగా ప్రవర్తిస్తే సదరు అభ్యర్థులను డీబార్ చేస్తామని, క్రిమినల్ కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేయడం కోసం కలెక్టరేట్‌లో 8801188046 నెంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు.



### ఇంటర్ పరీక్షలకు 42,439 మంది....

మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 67 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు 21624 మంది ప్రధమ, 20815 మంది ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. హాల్ టికెట్లతో ఉదయం 8:30 గంటలలోపే పరీక్షా కేంద్రానికి విద్యార్థులు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత వచ్చే విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు 3 సిట్టింగ్ స్క్వాడ్స్, మరో 3 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలు సీసీటీవీల నిఘాలో జరుగుతాయన్నారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఇద్దరు పరిశీలకులను కూడా నిర్మించినట్లు కలెక్టర్ చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం 24 గంటలూ పనిచేసేలా జిల్లా స్థాయిలో 08592-281275 నెంబరుతో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లను ముందుగానే జారీ చేయాలని కళాశాలల యాజమాన్యాలకు కలెక్టర్ స్పష్టం చేశారు. హాల్ టికెట్లు జారీ చేసేటప్పుడు కాలేజీ, హాస్టల్ బకాయిలు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తే సహించబోమని ఆమె హెచ్చరించారు. హాల్ టికెట్లను 9552300009 నంబరుకు వాట్సఅప్‌లో హాయ్ అని మెసేజ్ చేయటం ద్వారానూ ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

### 183 కేంద్రాలలో టెన్త్ పరీక్షలు...

మార్చి 17 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షల కోసం జిల్లాలో 183 సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 29,602 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయబోతున్నట్లు చెప్పారు. వీరిలో బాలురు 14,994 మంది, బాలికలు 14,608 మంది ఉన్నట్లు వివరించారు. విద్యార్థులలో 28176 మంది ఇంగ్లీష్ మీడియం, 1423 మంది తెలుగు మీడియం, మరో ముగ్గురు ఉర్దూ మీడియం వారు ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 గం. నుంచి మధ్యాహ్నం 12.45గం. వరకు జరుగుతాయని అన్నారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షిందుకు 9 ఫ్లయింగ్ స్క్వాడ్స్ ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధం గా ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 17 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు 1,564 మంది, మార్చి 3 నుంచి నిర్వహించే ఇంటర్ పరీక్షలకు 4,175 మంది విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యం కోసం ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఎలాంటి పుకార్లను వ్యాప్తి చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.


### పటిష్ట భద్రత : ఎస్పీ ఏ ఆర్ దామోదర్

ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రూప్ 2 మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రమునకు 200 మీటర్ల దూరం వరకు నిషిద్ధ ప్రదేశంగా భావించి 144 సెక్షన్ అమలులో ఉందని, ఈ పరీక్ష ముగిశాక ఆ పత్రాలు స్ట్రాంగు రూంలకు వెళ్లేంత వరకు పటిష్ట భద్రతా చర్యలు (తరువాయి 4లో...)

## ఉచిత వైద్య శిబిరంలో 185 మంది వైద్య సేవలు

**ఉచితంగా మందులు అందజేత**

**శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి**



(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, ఫిబ్రవరి 21)

ఒంగోలు కిమ్స్ సహకారంతో మండలంలోని నాగరాజకుంట గ్రామంలోని సచివాలయ ఆవరణలో శుక్రవారం తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి సారథ్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కిమ్స్ వైద్యులు బండి కిరణ్ జ్యోతి, డాక్టర్ రామాంజనేయులుతో కలిసి (తరువాయి 4లో...)



## స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

**గ్రామాల్లో అభివృద్ధితో పాటు**

**పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యతివ్వాలి**

**భూ రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి**

**అధికారులకు మంత్రి**

**డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచన**

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, వెలుగు, డ్వామా, ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకొని అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలి, యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనతోపాటు రైతుల ఆదాయాన్ని పెంచుతూ, మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేసేలా, జీరో పేదరికం, ఈజ్ ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకొని వాటికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కరెంట్ పోల్స్ తప్పని సరిగా ఏర్పాటు చేయడంతో (తరువాయి 4లో...)



## జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీ నమోదు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జనరల్ యూనియన్ ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షులు ఉబ్బా అశోక్ ఆధ్వర్యంలో మీడియా కెమెరా మెన్ అసోసియేషన్ హాలులో ఆదిత్య బిర్లా ఇన్సూరెన్స్ కంపెనీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రూ.15 లక్షల విలువైన ప్రమాద భీమా పాలసీలను నమోదు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కన్వీనర్ మేకపాటి మల్యాద్రి, జిల్లా అధ్యక్షులు ఉబ్బా అశోక్ మాట్లాడుతూ నిరంతరం పాత్రికేయ వృత్తిలో గడిపే జర్నలిస్టులకు ఆకస్మాత్తుగా ప్రమాదం జరిగితే రూ.15 లక్షల రూపాయల ప్రమాద బీమా వారి కుటుంబ సభ్యులకు అందే విధంగా (తరువాయి 4లో...)

# స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి



పాటు పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం రెవిన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ భూ రీ సర్వేను అత్యంత పగడ్బందీగా నిర్వహించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన ఫ్రీ హోల్డ్ ల్యాండ్స్ అక్రమాలు గుర్తించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల కోసం అనువైన ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. పరిశ్రమలకు భూములు కేటాయించే అంశంలో రైతులు, కలెక్టర్‌తో సంప్రదించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కేటాయింపులు జరపాలని సూచించారు. గృహ రుణాలకు అవసరమైన పొజిషన్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని సేవలు అందిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# గ్రూప్ 2 మెయిన్స్ రాత పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తీసుకోవటం జరిగిందని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయిస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ లో పోలీస్ హెల్ప్ డెస్క్ లను కూడా ఏర్పాటు చేయటం జరుగుతుందని, అభ్యర్థుల కొరకు అత్యవసర సమయంలో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు పరీక్షల సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని, ప్రశాంతంగా, సజావుగా పరీక్షలు నిర్వహించేలా పోలీస్ శాఖ తరఫునుండి అన్ని చర్యలు తీసుకున్నామని తెలియచేసినారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు ఉన్నట్లు తెలిస్తే వెంటనే అదుపులోకి తీసుకొని విచారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ ద్వారా కూడా భద్రతను పర్యవేక్షిస్తామని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్స్‌లో సూచించిన నియమ, నిబంధనలు కుణ్ణంగా చదువుకొని, వాటిని పాటించాలన్నారు. సోషల్ మీడియాలో మెయిన్స్ పరీక్ష గురించి నిజానిజాలు తెలుసుకోకుండా తప్పు దారి పట్టించే ఫేక్ న్యూస్ పెట్టినా, షేర్ చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్ 100, 112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102266కు సమాచారం అందించాలని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, ఆర్ఐఓ సైమన్ విక్టర్, డిఈఓ కిరణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరంలో 185 మంది వైద్య సేవలు



తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో కంటి వైద్యులు బండి కిరణ్ జ్యోతి రోగులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్ళద్దాలు అందజేశారు. అదే విధంగా సాధారణ వైద్యులు డాక్టర్ రామాంజనేయులు రోగులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 185 మంది రోగులు వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియాకు స్వాగతం పలికిన కలెక్టర్, అధికారులు

జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డిఆర్ఓ బి చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ కె లక్ష్మీప్రసన్న ఆయనకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారం, రీసర్వే జరుగుతున్న తీరుపై శనివారం సబ్ కలెక్టర్, ఆర్డిఓలు, తహసిల్దార్లతో సిసోడియా ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.





# జర్నలిస్టులకు ప్రమాద బీమా పాలసీ నమోదు



ఈ పాలసీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వం కలిగిన జర్నలిస్టులకు ఈ ప్రమాద బీమా వర్తిస్తుందని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఈజెయు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఫిబ్రవరి 21)

మండలంలోని వ్యవసాయ అధికారి ఆఫీసులో పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ గురించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ పోస్ట టెక్నాలజీ గురించి,మిరప రకాలు గురించి కోత అనంతరం చేసే ప్రయోగాల గురించి అన్ని వివరించారు. అలాగే రైతు సోదరులనుద్దేశించి మండల వ్యవసాయ అధికారి కే బుజ్జి బాయి 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి పలు విషయాలను వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 11అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్ కార్డు తరహాలో రైతులకు అందించనుంది. పొలము ఉన్న ప్రతి రైతు కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వివిధ పథకాలు రాయితీలు పొందాలంటే ఈ 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా నమోదు చేపించుకోవాలన్నారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొని రావటం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం.ఇది వ్యవసాయం రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం సమన్వయంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం అన్నారు.

**రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియలో ముఖ్యాంశాలు :** రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్ లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్య.ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుంది. రైతుకు చేకూరే ప్రయోజనాలు ఈ విశిష్ట సంఖ్య అర్హులైన భూమిగల రైతులు గుర్తించడంలో తోడ్పడి వారికి ప్రభుత్వం నుండి వచ్చు వివిధ సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుంది.ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమం అయిపోయిన తర్వాత రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య గురించి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల తహసీల్దార్ పి శైలేందర్ కుమార్, మండల వ్యవసాయ అధికారిణి కే బుజ్జి బాయి, మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ స్టాఫ్, పోస్ట హార్వెస్ట్ టెక్నాలజీ స్టాఫ్ , రైతులు పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో శిశు ఆధార్ నమోదు కేంద్రం

## లాంఛనంగా ప్రారంభించిన డిప్యూటీ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ ఎం శ్రీనివాసులరెడ్డి

## జనన, మరణ ధృవీకరణ పత్రాలు 100 ఏళ్ల వరకు భద్రపరచాలి

## జిజిహెచ్‌లో మెడికల్ రికార్డ్ విభాగం పరిశీలన



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

జనన మరణ ధృవీకరణ పత్రాలను వందేళ్ల వరకు భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ ఎం శ్రీనివాసులరెడ్డి, జిజిహెచ్ అధికారులను ఆదేశించారు. జీజీహెచ్ లో శిశు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసిన నేపథ్యంలో డీడీ జిజిహెచ్‌లో గైనిక్ విభాగంలో శిశు ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. సీఎస్సీ వారి సహకారంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పుట్టిన వెంటనే శిశు ఆధార్ నమోదు అయ్యేలా ఏర్పాటు చేశామని తెలిపారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యే సమయాన్ని జనన ధృవీకరణ పత్రాలను తల్లిదండ్రులకు అందచెయ్యకని ఆయన సూచించారు. శిశు ఆధార్ తో పాటు అబా ఐడీ ఇవ్వాల్సి ఉంటుంది అని అన్నారు. అనంతరం మెడికల్ రికార్డ్ విభాగాన్ని ఆయన పరిశీలించారు. రికార్డ్ నిర్వహణ, భద్రత, గ్రీవెన్స్ లకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జనన ,మరణ ధృవీకరణ పత్రాలను 100 ఏళ్ల పాటు భద్రపరచాలి అని, ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎస్సార్ఎంవో డాక్టర్ డాక్టర్ మాధవీలతకు తెలిపారు. జనన మరణ ధృవీకరణ పత్రాలలో తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని, లేదంటే సదరు వ్యక్తులు వారి వివరాలు మార్చుకునేందుకు ఇబ్బందులు పడతారని కాబట్టి జాగర్త వహించాలని అదేశించారు. జనన ,మరణ ధృవీకరణ పత్రం డిశ్చార్జ్ సమయంలో ఇవ్వాలని, మరణ ధృవీకరణ పత్రాలు కూడా ఆలస్యం లేకుండా ఇవ్వాలని మెడికల్ రికార్డ్ విభాగ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట సీఎస్ఆర్ఎం డాక్టర్ మాధవీలత, జిల్లా స్టాటిస్టికల్ అధికారి ప్రసాదరావు, నర్సింగ్ సూపరింటిండెంట్ అనంత లక్ష్మి, మెడికల్ రికార్డ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, సీఎస్సీ జిల్లా మేనజర్ ప్రమోద్, తదితరులు ఉన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రెటరీగా సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 21)

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి కుమారుడు సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా నియమించిన మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కి అందుకు సహకరించిన టిటిడి బోర్డు మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, వైకాపా ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైకాపా జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మార్కాపురం, గిద్దలూరు వైసీపీ ఇన్‌ఛార్జిలు అన్న వెంకటరాంబాబు, కేపీ నాగార్జునరెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పొదలకూరు ఎంపీడీవోగా సాయి ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)

పొదలకూరు మండల ఎంపీడీవోగా సాయి ప్రసాద్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడవలూరు మండలం నుండి బదిలీపై పొదలకూరు వచ్చినట్లు తెలిపారు. మండల అభివృద్ధి విషయంలో చిత్తశుద్ధితో పనిలో అంకితభావంతో పనిచేస్తానని అలాగే మండలంలో సమస్యల పైన దృష్టి సాధించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. మంగళవారం బిసి ఓబీసీలకు సబ్సిడీ రుణాలకై ఇంటర్వ్యూలు పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నాడు బీసీ, ఓబీసీలకు కేటాయించబడిన సబ్సిడీ రుణాలకై దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు నిర్వహించబడునని పొదలకూరు ఎంపిడివో సాయి ప్రసాద్ అన్నారు. సబ్సిడీ రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ నేపథ్యంలో లబ్ధిదారులకై దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు బ్రాంచ్ బ్యాంకు అధికారులు హాజరవుతారని ఆయన చెప్పారు మండలం మొత్తం 46 సబ్సిడీ రుణాలు ప్రభుత్వం కేటాయించిందని ఇందులో ఓబీసీ 30, కాపులకు 5,కమ్మలకు 2,ఇతరలకు 9 మొత్తం 46 సబ్సిడీ రుణాలు మంజూరైనట్లు అలాగే మండలంలో మెత్తం 30 గ్రామ పంచాయతీలో వచ్చిన దరఖాస్తులు 556 అందాయని ఎంపీడీవో సాయి ప్రసాద్ వివరించారు.

# చంద్రవాహనం పై భక్తులకు దర్శనం





(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 21)

పొదిలి శ్రీ పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారు చంద్రవాహనం పై నటరాజ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు యాదాల వెంకటేశ్వర్లు, ఎం సుధీర్ కుమార్, సునీల్ కుమార్, టి సూర్యనారాయణ, వెంకట సీతారామాంజనేయ ప్రసాద్ కుటుంబ సభ్యులను మేళతాళాలతో ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి, మహా శివరాత్రి ఉత్సవ కమిటీ ప్రతినిధి ఒగ్గు వెంకట్రామయ్యలు దేవాలయానికి ఆహ్వానించారు. ఉభయదాతలను తీసుకుచ్చేటప్పుడు చిన్నారుల భరతనాట్య నృత్యప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఉభయదాతలు, బంధువులతో ఆగమ నిర్వహకులు దరిశి వెంకటరామ్మూర్తి, సుధాకర్, కె బాలకృష్ణ ఎం సుబ్బనరసయ్య, మంత్రపుష్పార్చన, పూజలు జరిపించారు. అనంతరం స్వామివారిని భక్తుల దర్శనం కోసం గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహిళాభక్తులు శివాలయంలో పారాయణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఈవో నర్రా నారాయణరెడ్డి, మహాశివరాత్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఒగ్గు వెంకట్రామయ్య, ఇతర సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# విధ్వంసం నుంచి పూర్వవైభవం దిశగా ఏపీ

**కూటమి ప్రభుత్వ పాలనతో రాష్ట్రానికి మంచి రోజులు**
**ఐదేళ్లూ చేసిన పాపాలకు వైసీపీ నేతలకు**
**నోరు తెరిచే హక్కు కూడా లేదు**
**మొదట వాళ్లు షర్మిల వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి**
**విక్రమ సింహపురి యూనివర్సిటీలో**
**ఉద్యోగాలు అమ్మేసుకున్న కాకాణి అండ్ బ్యాచ్**
**వెంకటాచలం మండలం కాకుటూరులో**
**రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించిన**
**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
**సోమిరెడ్డికి ఘనస్వాగతం పలికిన కాకుటూరు వాసులు**





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)**

ఐదేళ్ల జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రధానంగా వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్అండ్‌బి శాఖలు మూతపడ్డాయి. ఇరిగేషన్ కాలువలు కనీసం పూడికతీతకు నోచుకోలేదు. వైసీపీ నేతలు పనులు చేయకుండానే బిల్లులు చేసేసుకున్నారు. ఆర్అండ్‌బి శాఖ పరిధిలో గుంతలు కూడా పూడ్చలేక రహదారులను అస్తవ్యస్తంగా మార్చారు. వ్యవసాయ శాఖ పరిధిలో అయితే బిందు తుంపర్ల సేద్యం లేదు. యాంత్రీకరణ లేదు, సూక్ష్మ పోషకాలు లేవు, కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే పథకాలను కూడా మూలనపెట్టేశారు. దేశవ్యాప్తంగా అమలైన పథకాలను ఏపీలో కనిపించకుండా చేశారు. సెంట్రల్ గవర్నమెంటు 60 శాతం నిధులు ఇచ్చే డ్రిప్ ఇరిగేషన్ పథకం ఐదేళ్లూ ఊసేలేకుండా పోయింది. వైసీపీ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి కలెక్షన్లలో మునిగితేలితే ఇరిగేషన్ మినిస్టర్ డాన్సులకు పరిమితమయ్యారు. ఒక విధ్వంసకరమైన పాలన నుంచి బయటపడిన ఏపీ కూటమి ప్రభుత్వ పాలనలో పూర్వవైభవం దిశగా ముందుకు సాగుతోందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెడుతున్నారన్నారు. ప్రజలకు తాగునీరు అందించే జలజీవన్ మిషన్‌ను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఆ పథకాన్ని తిరిగి అమలు చేసి రిజర్వాయర్ల ద్వారా తాగునీరు అందించే ప్రయత్నం జరుగుతోందన్నారు. జలజీవన్ మిషన్ ను ఎందుకు చేయలేకపోయారు..పోలవరం ప్రాజెక్టును ఎందుకు కట్టలేకపోయారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా ఎందుకు మిగిలిచ్చారు. జగన్ రెడ్డి ఏటా ప్రకటిస్తామన్నా జ్యాబ్ కాలెండర్ ఏమైపోయింది...డీఎస్సీ నోటిఫికేషన్లు ఏమైపోయాయో.ఒక ముఖ్యమంత్రికి ఎలాంటి లక్షణాలు ఉండకూడదో...అలాంటివన్నీ పెట్టుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని దుయ్యబట్టారు. మిర్చికి రూ.7 వేలు ధర నిర్ణయిస్తూ 2020లో జీఓ ఎంఎస్ నెం 28 ఇచ్చిన జగన్ రెడ్డి ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. మా కూటమి ప్రభుత్వం మిర్చి రైతులకు అండగా ఉంది. కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది..ధర కూడా రోజురోజుకీ పెరుగుతోందన్నారు. జగన్మోహన్ రెడ్డి మొదట తోడబుట్టిన చెల్లెలు మాటకు సమాధానం చెప్పాలని, నా స్నేహితుడు కాకాణికి హితవు పలుకుతున్నానన్నారు. ఐదేళ్లు చేసిన పాపాలకు కాకాణి లాంటి వారు నోరుమూసుకుని ఉండాలి. దమ్ముంటే షర్మిల మాటలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్మోహన్ రెడ్డి పరువు రాష్ట్రం, దేశంలోనే కాదు ఇంట్లో కూడా పోయిందన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ ఏర్పాటు కోసం కాకుటూరు రైతులు తమ భూములను త్యాగం చేశారన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో ఏడుగురు నిర్వాసితులకు ఉద్యోగాలు ఇప్పిచ్చాం..వైసీపీ హయాంలో కాకాణి ఆయన చెంచాలు కలిసి 69 ఉద్యోగాలు అమ్ముకున్నారన్నారు. భూములు కోల్పోయిన రైతుల పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించాల్సిన బాధ్యతను విస్మరించి ఉద్యోగాలకు రేటు కట్టారు. ఈ రోజుకీ 48 మంది నిర్వాసితులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారన్నారు.

## గ్రూప్ 2 మెయిన్ పరీక్షల నిర్వహణకు కంట్రోల్ రూం ఏర్పాటు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)**

ఈ నెల 23వ తేది ఆదివారం జరుగబోవు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 మెయిన్ పరీక్షలు సక్రమ నిర్వహణకు జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె. ఉదయభాస్కర్ రావు తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 నుండి 12:30 వరకు పేపర్ -1పరీక్ష, తిరిగి మధ్యాహ్నం 3:00 నుండి 5:30 వరకు పేపర్ -2పరీక్ష జరుగుతుందని, జిల్లాలోని 7 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్లో 22, 23 వ తేదీల్లో రెండు రోజులు కంట్రోల్ రూమ్‌ను (నెంబర్: 0861 2331261) ఏర్పాటు చేస్తున్నట్లు డిఆర్‌ఓ తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రాల అడ్రస్ సమాచారం, మరేతర సమాచారం కొరకు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

## మేకపాటి గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)**

నెల్లూరులో డైకాస్ రోడ్డులో మాజీమంత్రి స్వర్గీయ మేకపాటి గౌతమ్‌రెడ్డి తృతీయ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై గౌతమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేకపాటి గౌతమ్‌రెడ్డి మంత్రిగా ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి కలిసి గౌతమ్‌రెడ్డి జ్ఞాపకాలను చంద్రశేఖర్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం

**పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా**
**పనులు చేయిస్తున్న టీడీపీ స్థానిక నాయకులు**



**(షణ్ముఖ వెలుగు, దొరవారిసత్రం, ఫిబ్రవరి 21)**

తిరుపతి జిల్లా దొరవారి సత్రం మండలం పూలతోట సచివాలయం పరిధిలో ఉన్నటువంటి వడ్డీపాలెంలో పల్లె పండుగ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం టీడీపీ స్థానిక నాయకులు దుర్గా ప్రసాద్ నాయుడు నేతృత్వంలో సిసి రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తిరుపతి జిల్లా రోడ్ల నిర్మాణం పనులను తనిఖీ చేశారు. రొడ్లు వేగంగా, నాణ్యతగా వెయిస్తున్న టిడిపి స్థానిక నాయకులు సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్ బండి పోలయ్య, అధికారులు అభినందించారు.

## మాస్టర్ ప్లాన్ ప్రకారం పెంచలకోన క్షేత్రం అభివృద్ధి

**మేలో జరగనున్న బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తాం**
**రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి**
**పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించిన మంత్రి ఆనం**
**మంత్రికి ఘన స్వాగతం పలికిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ**



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)**

మాస్టర్ ప్లాన్ ప్రకారం పెంచలకోన క్షేత్రం అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించారు. పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారిని, ఆదిలక్ష్మి అమ్మవారిని, ఆంజనేయస్వామిని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి దర్శించుకున్న అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడారు. మేలో జరగనున్న బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అంతకుముందు మంత్రి,ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు దేవస్థానం వేద పండితులు,దేవస్థాన అధికారులు.

## మోడల్ స్కూల్ విద్యార్థులు ముందంజలో ఉండాలి

**జన విజ్ఞాన వేదిక జాతియ ఉపాధ్యక్షులు గయాజ్**
**పదో తరగతి పరీక్షలలో నియోజకవర్గంలో మొదటి స్థానంలో ఉండాలి**
**విద్యార్థులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలవాలి**
**ప్యాడ్లు పెన్నులు అందజేసిన ఉపాధ్యాయులు సతీష్**

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 21)**

విద్యార్థిని, విద్యార్థులు 10వ తరగతిని మోడల్ స్కూల్ నందు ముగించుకుంచుకొని భవిష్యత్ తరానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని కనిగిరి నియోజకవర్గంలో అత్యుత్తమ మార్కులతో రాణించాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షులు గయాజ్ కోరారు. శుక్రవారం కనిగిరిలోని మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి తులసి ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి విద్యార్థుల మోటివేషన్ తరగతిలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని వ్యసనాలకు ప్రలోభాలకు దూరంగా ఉండి పాఠశాలలో ఉపాధ్యాయుని ,ఉపాధ్యాయులు అందించే పదవ తరగతి గైడెన్స్ ను పొంది మంచి ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలని ఇప్పటినుంచే మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని అన్నారు విద్యార్థిని విద్యార్థులు తెల్లవారుజామున నాలుగు గంటలకే నిద్రలేచి పరీక్షలకు సన్నద్ధం కావాలని కోరారు ఈ క్రమంలో మధ్యలో పాడిన గేయాలు విద్యార్థులను ఆలోచింపజేసాయి ఆయన చేసిన బోజన సమయనీ మరచిపోయి ఎంతో ఆసక్తిగా విద్యార్థులు విన్నారు. గీతాలపనకు, మోటివేషన్ కాలాన్ని కూడా మర్చిపోయారు,ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ పద్మావతి తులసి, ఎస్ఎంసి చైర్మన్ పందిటి మోహన్ మాట్లాడుతూ గయాజ్ సేవలు ఎంతో అవసరమని,రాబోవు రోజులలో విధ్యావికాశానికి తోడ్పాడే కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అవ్వాలని ఆకాంక్షిస్తూ స్కూల్లో ఫస్ట్ మార్క్ సాధించిన వారికి ఎస్ఎంసి చైర్మన్ పందిటి మోహన్ మోహన్ 5000 రూపాయలు బహుకరిస్తామని తెలిపారు. అనంతరం కెమిస్ట్రీ లెక్చరర్ సతీష్ పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్‌లు బహూకరించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు నారాయణ, జ్యోతి, గీత, కిషోర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





## నెల్లూరుకు తలమానికం దగదర్తి విమానాశ్రయం

**కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి**



**(షణ్ముఖ వెలుగు, దగదర్తి, ఫిబ్రవరి 21)**

దగదర్తిలో విమానాశ్రయం ఏర్పాటుతో భారతదేశ పటంలో నెల్లూరు జిల్లా తలమానికంగా నిలవనుందని కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అన్నారు. 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారని, గత ప్రభుత్వం పూర్తిగా విమానాశ్రయాన్ని నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక కృషి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు చొరవతో మళ్లీ ఎయిర్‌పోర్టు మొదలయ్యాయని చెప్పారు. రామాయపట్నం పోర్టు, కృష్ణపోర్టుకు అనుసంధానంగా దగదర్తిలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని, జిల్లాలో పారిశ్రామి ప్రగతి సాధించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టారని చెప్పారు. డిపిఆర్‌లు తయారు చేసి 96 కోట్ల నిధుల విడుదలకు కూడా సీఎం ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. రైతులందరూ కూడా తమ బిడ్డల భవిష్యత్, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం తమ భూములను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎయిరిండియా అధికారులు టెండర్లు, డిపిఆర్ మొదలైన ప్రక్రియలను పూర్తి చేయాలని కోరారు. అన్ని పనులు పూర్తయితే త్వరలోనే కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

## నేడు వాసం విద్యానికేతన్‌లో 200 ప్రాజెక్ట్‌ల ప్రదర్శన

**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, ఫిబ్రవరి 21)**

మార్కాపురంలోని వాసం విద్యానికేతన్ నందు శనివారం సర్ సీవీ రామన్ సైన్స్ ఎక్స్పోను డైరెక్టర్ 4 ప్రిన్స్‌పల్ కే రంగయ్య, ఏ.ఓ. రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది విద్యార్థులు దాదాపు 200 ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించ బోతున్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ యూ నాగరాజు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున్ రాధికా, డిఈఓ శామ్యూత్, ఎంఈఓలు రాందాస్ నాయక్, టి శార్వాణి, బాయ్స్ హై స్కూల్ గెజిటెడ్ హెడ్ మాస్టర్, జగన్ నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత మునగాల చంద్రశేఖర్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సభ్యురాలు గోళ్ళ వరలక్ష్మి లు ముఖ్య అతిథులుగా విచ్చేయుచున్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## దాచూరు గ్రామంతో 40 ఏళ్ల అనుబంధం

**- గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తా - సొంత గ్రామంలో కల్యాణ మండపం నిర్మించడం**
**- అమరా శ్రీరాములు శ్రేష్ఠి గొప్ప మనసుకు నిదర్శనం - రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**
**- ఎమ్మెల్యే రామకృష్ణతో కలిసి కల్యాణ మండపం ప్రారంభించిన మంత్రి**

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)**

దాచూరు గ్రామంతో తనకు 40 ఏళ్ల అనుబంధం వుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం కలువాయి మండలం దాచూరు గ్రామంలో పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ అమరా శ్రీరాములు శ్రేష్ఠి తన సతీమణి అమరా వసుంధరమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన శ్రీ పెనుశిల లక్ష్మి నరసింహస్వామి కల్యాణ మండపాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి మంత్రి ప్రారంభించారు. తొలుత గ్రామానికి విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేకి స్థానిక గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1985నుంచి దాచూరు గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం వుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా తనకు గ్రామంలోని ప్రతి కుటుంబం అండగా నిలిచిందన్నారు. సొంత గ్రామానికి ఏద్కైనా మంచిపని చేయాలనే ఆశయంతో అమరా శ్రీరాములు శ్రేష్ఠి అత్యంత సుందరంగా ఈ కల్యాణ మండపాన్ని గ్రామస్థుల కోసం నిర్మించడం ఆయన ఉదారత, గొప్పమనసుకు నిదర్శనంగా మంత్రి కొనియాడారు. ఈ మండపాన్ని చుట్టుపక్కల గ్రామాలవారు కూడా వినియోగించుకోవాలని సూచించారు. జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. గ్రామంలో ముంపునకు గురైన పోలేరమ్మ, చెన్నకేశవస్వామి ఆలయాలను నిర్మిస్తామని, పోలేరమ్మ ఆలయానికి 30 లక్షలు, చెన్నకేశవస్వామి ఆలయానికి కోటి రూపాయలు మంజూరు చేశామని, ఏడాదిలోగా ఆలయాలను ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు. గ్రామంలో హైస్కూల్‌కు జెడ్పీ నిధులతో ప్రహారీగోడ నిర్మిస్తామని, విద్యార్థుల తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆదూరుపల్లి-గోనుపల్లి రహదారిని రెండులైన్ల రహదారిగా నిర్మిస్తామని చెప్పారు. గ్రామానికి అవసరమైన అన్ని సదుపాయలను కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్యాణ మండపం నిర్మాణదాత అమరా శ్రీరాములు శ్రేష్ఠి, అమరా శరత్‌బాబు, రాచపూటి పెంచలకుమార్, అమరా కుటుంబసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన

## మేధావుల సదస్సులో 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)

20 సూత్రాల అమలు కమిటీ కార్యక్రమం చైర్మన్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి లంక దినకర్ నెల్లూరులోని రామ్మూర్తి నగర్, వర్షాస బిల్డింగ్‌లో జరిగిన మేధావుల సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ మొత్తం రూ. 50,65,000 కోట్లు అని తెలిపారు. ఈ బడ్జెట్‌ను మహిళలు, యువత, మధ్య తరగతి, అన్ని వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని రూపొందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉద్యోగస్తుల విషయంలో, రూ. 12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇచ్చారని, దీని వల్ల కేంద్ర ప్రభుత్వానికి రూ. 1 లక్ష కోట్ల నష్టం వచ్చినా, ఉద్యోగస్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రెండు స్వయం గృహాల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు, 36 రకాల లైఫ్‌సేవింగ్ డ్రగ్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు వంటి ప్రయోజనాలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా, ఈ బడ్జెట్ అంత్యోదయ స్ఫూర్తితో రూపొందించారని, పథకాలు చివరి వ్యక్తి వరకూ చేరాలన్న ఉద్దేశంతో ప్రణాళిక రూపొందించారని అన్నారు. ఇది కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన 8వ బడ్జెట్ అని తెలిపారు.మూలధన వ్యయాన్ని ఉద్దేశించి, రూ. 10.18 లక్షల కోట్ల పెట్టుబడులతో ఉత్పాదక ఆస్తుల అభివృద్ధికి ఊతం ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాలకు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణంగా రూ. 1.50 లక్షల కోట్లు కేటాయించడం శుభపరిణామమని, రాష్ట్రాలు సమన్వయంతో రూ. 25 లక్షల కోట్లు మూలధన వ్యయం చేసే అవకాశముందని తెలిపారు. పట్టణాల అభివృద్ధికి రూ. 1 లక్ష కోట్లు, గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి కోసం 'జల్ జీవన్ మిషన్'ను 2028 వరకు పొడిగించారని వివరించారు. నెల్లూరుకు అమృత్ పథకం కింద రూ. 125 కోట్లు కేటాయించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైల్వే బడ్జెట్ కింద రూ. 9,412 కోట్లు కేటాయించారని తెలిపారు. స్వయం సహాయక గ్రూపుల కోసం గ్రామీణ క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపరిచారని అన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి రూ. 57,57,000 కోట్లు వాటాగా వస్తాయని, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రూ. 30,000 నుంచి 40,000 కోట్లు రావచ్చని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటివరకు రూ. 18,000 కోట్లు కేటాయించగా, 41.50 మీటర్ల ఎత్తు నీరు నిల్వ ఉండే విధంగా రూ. 12,157 కోట్లు ఆమోదించారని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 5,936 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు.అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. 15,000 కోట్ల గ్రాంట్‌ను ఈ ఆర్థిక సంవత్సరానికి విడతల వారీగా విడుదల చేస్తుందని తెలిపారు. .విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ. 3,295 కోట్లు, వైజాగ్ పోర్టుకు రూ. 730 కోట్లు, ఆహార సబ్సిడీకి రూ. 2,03,420 కోట్లు కేటాయించారని వివరించారు. నెల్లూరు జిల్లాకు రూ. 2,500 కోట్ల ఎరువుల సబ్సిడీ అందిందని, కిసాన్ సమ్మాన్ యోజన కింద నెల్లూరు రైతులకు రూ. 6,000 చొప్పున 1,68,000 మందికి అందిస్తున్నట్లు తెలిపారు.సోమశిల-కండలేరు ప్రాజెక్టులను దీర్ఘకాలిక నీటి వనరులుగా గుర్తించారని, నెల్లూరు జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని వివరించారు.ఇంత సమగ్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శిపారెడ్డి వంశీధర్ రెడ్డి, అడ్వకేట్ రంగరాజన్, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, రాష్ట్ర సహ ట్రెజరర్ కందుకూరు సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయ రెడ్డి, కమల,ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు పెంచలయ్య, నరసింహనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరబోలు రాజేష్ గడ్డం విజయ్ కుమార్ యశ్వంత్ సింగ్, జిల్లా కార్యదర్శి కాసా సీనయ్య, దాసరి ప్రసాద్ చిలకా ప్రవీణ్ కుమార్ ,పరుశురాం, ట్రెజరర్ సి వి సి సత్యం, మహిళా మోర్చా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, సోషల్ మీడియా కన్వీనర్స్ ముని సురేష్, పిడుగు లోకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.



# బహుజనుల అభివృద్ధికి ఏనాడు పాటుపడలేదు

## 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 21)

అగ్రకుల పార్టీలలో ఉన్న రాజ్యసభ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు గానీ ఎస్సీ ,ఎస్టీ ,బీసీ మైనారిటీ ప్రజల అభివృద్ధి కోసం పని చేసేవారు కాదని వారి యొక్క స్వలాభం కోసం బహుజన నాయకులు పదవులు పొందుతూ అభివృద్ధి చెందుతున్నారు తప్ప బహుజనుల అభివృద్ధికి ఏనాడు పాటుపడలేదని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో మండిపడ్డారు. బహుజనులకు రాజ్యాధికారం కావాలని ఎంతో త్యాగం చేస్తూ మన ముందుకు భారత చైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్‌ని బహుజనులు అందరూ ఆదరించి ఆయన అడుగుజాడల్లో నడిస్తే తప్ప బహుజనులకు నిజమైన రాజ్యాధికారం దక్కుతుందని శ్రీనివాసులు అన్నారు. మరి కొంతమంది తమ స్వార్థ ప్రయోజనాల కోసం సంఘాలను అడ్డుపెట్టుకొని వివిధ రాజకీయ పార్టీల దగ్గర బానిస బతుకుల బతుకుతూ బహుజన చైతన్యాన్ని తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. కొంతమంది బీసీ కార్డును అడ్డుపెట్టుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందిన బీసీ నాయకులు వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తూ బహుజనులను రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాల అవుతున్న బహుజనులు ఓటేసే యంత్రాల్లాగా మిగిలిపోయారని గ్రహించిన వ్యాపారవేత్త ఎన్నో ఆటుపోట్లు తట్టుకుంటూ బహుజనులను రాజ్యాధికారంలోకి తీసుకురావాలని నిరంతరం శ్రమిస్తున్న ఏకైక నాయకుడు రామచంద్ర యాదవ్ ఒక్కరేనని శ్రీనివాసులు తెలిపారు. కార్మిక కర్షక విద్యార్థి మేధావులారా రైతులారా మన బ్రతుకులు మారాలంటే ప్రస్తుత రాజకీయ పార్టీలను పక్కనపెట్టి భారత చైతన్య యువజన పార్టీని బలోపేతం చేద్దాం జనాభా దామాషా ప్రకారం పదవులు పొంది రాజ్యాధికారంలోకి వెళ్లే విధంగా కార్యచరణ రూపొందించుకుందామని ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనారిటీ ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీనివాసులు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చైతన్యవంతమైనటువంటి రాజకీయ చైతన్య సభలను ఏర్పాటు చేసుకుని రాజ్యాధికారంలోకి వెళ్లే విధంగా ప్రయత్నం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రస్తుత రాజకీయ పార్టీలకు దీటుగా రాజకీయం చేద్దాం రాజ్యాధికారం సాధిద్దాం అనే రామచంద్ర యాదవ్ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ భారత చైతన్య యువజన పార్టీని బలోపేతం చేయాలని శ్రీనివాసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అమ్మ భాషను కాపాడుకుందాం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఫిబ్రవరి 21)

మన మాతృభాష తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు, భాషాభిమానులు కృషి చేయాల్సిన అవసరం ఉందని పార్వతీపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెన్నెల మల్లికార్జున రావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన మాతృభాష తెలుగును కాపాడుకుంటూనే ఆంగ్ల భాషను గౌరవిద్దామని చెప్పారు. వందమంది తెలుగు కవుల చిత్రాలు,వారి రచనలు ప్రదర్శించారు. తెలుగు కవుల చిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులకు తెలుగు పద్యాల కంఠస్థ పోటీలు, తెలుగు భాష ప్రాధాన్యత అనే అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిని, సునీత, ఆదిలక్ష్మి ,వరలక్ష్మమ్మ, సుజాత, రిజ్వాన, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానంలో 67వ సప్తాహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

## దేవస్థానాన్ని సందర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)

సిఎస్పురం మండలం మిట్టపాలెంలో వెలసిన పుణ్యక్షేత్రం శ్రీ నారాయణస్వామి వారి దేవస్థానంలో 67వ సప్తహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించుచున్న సందర్భంగా కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దేవస్థానమును సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు సందర్భంగా దేవస్థానమునకు వచ్చు ప్రతిభక్తుడికి ఎటువంటి అసౌకర్యము కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్నఆదినారాయణ వార్లను ఆదేశించారు. ఏర్పాట్లలో భాగంగా భక్తులకు తాగునీటి సౌకర్యము, భక్తులు ఎండకు ఇబ్బందిపడకుండా ఎక్కడి అక్కడ టెంట్లు, టాయిలెట్స్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవముల అనంతరం అభివృద్ధి కార్యక్రమములలో భాగంగా దేవస్థానము యొక్క మాస్టర్ ప్లాన్ తయారు చేయించవలెను అని కార్యనిర్వహణాధికారిని ఆదేశించారు. అదేవిధముగా అలయం ఆవరణలో చెట్లు ఎక్కువగా పెంచాలని ఆదేశించారు. అనంతరం శ్రీ స్వామి వారి ధర్వాజ ముఖద్వారమునకు 30 కేజీల వెండితోడుగు చేయించిన దాతలు పామూరు గ్రామస్తులు బహునాధం శివప్రసాద్ ఆచారిని అభినందించారు. ఈ కార్యక్రమములో కొమ్మినేని వెంకటరావు, బొబ్బూరి రమేష్, పాలపర్తి నారాయణరావు, ఎంసీ మాలకొండయ్య, అమడసాని బాల కేశవరెడ్డి, దొనపాటి మోహన్ రెడ్డి, చావా సుబ్బయ్య, షేక్ నాయబ్ రసూల్, పోకల మాలాద్రి మరియు మండల నాయకులు గ్రామస్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ గోడ పత్రిక ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)

సియస్‌పురం మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు ఆహ్వానం మేరకు శుక్రవారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా నూతనముగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నుంచి ఆర్ అండ్ బి రోడ్డు వరకు సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేశారు. తదుపరి శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మార్చి 6 నుంచి 9 వరకు జరగనున్న గరుడ, విమాన కలస రాజగోపాల ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పిడుగు బాబురావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బొబ్బూరి రమేష్, సిఎస్పురం ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య, నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, బత్తుల వెంకటాద్రి, చెరుకుపల్లి వెంకటరెడ్డి, సుంకరి కృష్ణయ్య, ఆలా తిరుపతయ్య, అమడసాని బాల కేశవరెడ్డి, ధన పార్టీ మోహన్ రెడ్డి, షేక్ రజ్జాబ్ బాషా, కొట్టే నాగప్రసాద్, పాలపర్తి నారాయణరావు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోనంగి వెంకట కొండయ్య, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ రెవెన్యూ అధికారుల 2025 డైరీ ఆవిష్కణ

(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

కొండపి మండలము తహసీల్దార్ వారి కార్యాలయము నందు ఈ నెల 21వ తేదీన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం 2025 సంవత్సరం డైరీని తహశీల్దార్ పి మురళీ చేతుల మీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సంఘ డైరీ లో గల గ్రామ పరిపాలన అంశములు పాటిస్తూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలములో పనులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమములో డిప్యూటీ తహశీల్దార్లు బి రవికుమార్, కె డేవిడ్ రాజు, కె కాశయ్య, సీనియర్ అసిస్టెంట్ డి వెంకటేశ్వరరెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ వి వాణి, ఒంగోలు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాసరావు, మండల వి ఆర్ఓ సంఘ అధ్యక్షులు సిహెచ్ అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు కె సుశీల, సెకెటరీ కె మాధవి, విఆర్ఓలు శ్రీదేవి, రామకృష్ణ, జ్యోత్స్న, రామాంజనేయలు, మస్తాన్, అమర్, ఆపరేటర్స్ రాము, నరేష్, అటెండర్ మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



# శరవేగంగా వీరరాంపురంలో గ్రావెల్ రోడ్డు పనులు



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, ఫిబ్రవరి 21)

హనుమంతునిపాడు మండలం వీరరాంపురం గ్రామంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం గ్రావెల్ రోడ్డు నిర్మాణము పనులు శరవేగంగా జరుగుచున్నవి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆల శివ మండల టిడిపి అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప్పుటూరి శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ కనమర్లపూడి వెంకటనారాయణ, దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, గ్రామంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు నాయకులు, గ్రామంలోని ప్రజలు ధన్యవాదములు, అభినందనలు తెలిపారు.

# కొండపి స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన డిఎస్పీ




(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

కొండేపి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం డిఎస్పీ సాయి ఈశ్వర్ జస్వంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్‌లో పలు ఫైళ్ళు తనిఖీ చేశారు. మోటార్ సైకిల్ వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, పోలీస్ సిబ్బందికి సహకరించాలని అన్నారు. షాపు యజమానులు ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలకు గంజాయి, పేకాట, కోడి పందాలు, అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లయితే వారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని ఎస్ఐ ప్రేమ్ కుమార్‌ని ఆదేశించారు.

# ఉబ్బా అశోక్ బాబును సన్మానించిన రిపోర్టర్స్, కెమెరామెన్‌లు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా గెలుపొందిన షణ్ముఖ వెలుగు స్టాఫ్ ఫోటోగ్రాఫర్ ఉబ్బా అశోక్ బాబుకి ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్, వివిధ పత్రికలో పని చేస్తున్న విలేకరులు, కెమెరామెన్‌లు శుక్రవారం ఎంసీఏ భవనంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ మేకపాటి మాలాద్రి, మీడియా ప్రతినిధులు, అసోసియేషన్ సభ్యులు నూకతోటి శరత్ కుమార్, కోరుకొండ సుబ్బారావు, కంచర్ల శివలింగేశ్వరరావు, ఏ సుబ్బారావు, పల్లపు శేషు, గడ్డం మారుతీరావు, కన్నదారి హరి, సుడిదేల ప్రతాప్‌రెడ్డి, మండ వెంకట శ్రీనివాస్, భైరపునేని శ్రీనివాసరావు, సోమల శ్రీనాథ్‌రెడ్డి, చెన్ను బోయిన అశోక్ కుమార్, మద్దిరాల సాంబశివరావు, నాగేంద్ర, టీ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని





(షణ్ముఖ వెలుగు, గుంటూరు, ఫిబ్రవరి 21)

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ ప్రసంగించారు. గత ఎనిమిది నెలల కూటమి పాలనలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతర కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు, ఉపాధ్యాయులు తమ సమస్యలను వ్యక్తం చేయడానికి భయపడే పరిస్థితులు నెలకొన్నాయని, ప్రస్తుతం ప్రజాస్వామ్య వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సన్నిహితుడైన రాజేంద్రప్రసాద్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారని కొనియాడారు. పది లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని వివరించారు. ఉపాధ్యాయులు, ప్రైవేటు టీచర్లు, ఇతర ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అమరావతి పర్యటన సందర్భంగా కాలచక్ర భవనంలో మద్యం దుకాణం తెరవడం వంటి గత ప్రభుత్వ తప్పిదాలను ఎత్తిచూపారు. ప్రభుత్వ సంస్థల ఆదాయాలను దుర్వినియోగం చేసిన తీరును విమర్శించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ పరిశీలకులు రాఘవేంద్ర, అఖిల భారత ఓబీసీ సంఘం చైర్మన్ అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 21)

మండలంలోని ఉలవపాడు హై స్కూల్ కరేడులోని కేజీబీవీ కరేడు హైస్కూలు మండలంలోని అన్ని హైస్కూల్లో గతంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఎవరికైతే దృష్టిలోపం కలిగిన పిల్లలకు శుక్రవారం అందరికీ కంటి అద్దాలు పంపిణీ చేశారు. కరేడు కేజీబీవీ స్కూల్ నందు కరేడు వైద్యాధికారి డాక్టర్ కె శ్రీనివాస్, అలాగే ఉలవపాడు హై స్కూల్ నందు కరేడు వైద్యాధికారిని రమ్య జ్యోతి పాల్గొని విద్యార్థులకు కంటి అద్దములు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులందరికీ దృష్టిలోపం రాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కంటి వైద్య నిపుణులు మురళీకృష్ణ రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు సిహెచ్‌ఓలు స్కూల్ హెడ్మాస్టర్లు , టీచర్లు పాల్గొన్నారు.

# గ్రూప్ 2 పరీక్షల్లో రోస్టర్ విధానం

సరి చేసిన తరువాతే పరీక్షలు నిర్యహించాలి

అఖిల భారత యువజన సమాఖ్య

మాజీ రాష్ట్ర కార్యదర్శి కె వీరారెడ్డి డిమాండ్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23వ తేదీన నిర్వహించే గ్రూప్ 2పరీక్షలు రోస్టర్ విధానం సరి చేసిన తరువాత నే నిర్యాహించాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులతో ధర్నా నిర్యహించారు. యువతను నఉద్దేశించి వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరాలు గడుస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయలేదని, డీఎస్సీ ప్రకటలో అలసత్యం వహిస్తూ నిరుద్యోగు లకు ఉపాధి కల్పనలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యువతకి ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. డీఎస్సీ వెంటనే విడుదల చేసి యువతకి ఉపాధి కల్పించాలని అన్నారు.ధర్నాకు సిపిఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ శ్రీనివాసరావు సంఘీభావం తెల్పి మాట్లాడుతూ నిన్నటి వరకు కోర్టు లో ఉన్నాదని చెప్పి టైమ్ లేకుండా 23తేదీ పరీక్ష జరుపు తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం సరైన పద్ధతి కాదని, ప్రథమ న్యాయస్థానమే రోస్టర్ విధానం లో తప్పు లు ఉన్నట్లు ప్రకటించిందన్నారు. సరిచేసి పరీక్షలు నిర్యహించాలని అన్నారు. నిరుద్యోగ యువత పోరాటానికి భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ )అండగా ఉంటున్నాదని అన్నారు. ఈ కార్యక్రమంలో బాషా, సలో మాన్, విజయరాజ్, సంపత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు వడివడిగా అడుగులు

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

ఎయిర్‌పోర్టు ఏర్పాటు పరిశీలనకు విచ్చేసిన కేంద్ర బృందం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)

జిల్లా ప్రజల చిరకాల కోరిక దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఆదేశాల మేరకు శుక్రవారం దగదర్తి విమానాశ్రయం ఏర్పాటు ప్రాంతాన్ని భారత ప్రభుత్వ విమానయాన సంస్థ డీజీఎం మల్లికా జయరాజ్, డీజీఎం పరవేంధర్ తివారి, సీజేంద్ర కుమార్ రెడ్డి, సుజీన్ రాజు పరిశీలించారు. ఈ పర్యటనలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో మనం భాగస్వామిగా వుండడంతో అనేక పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి పనులు మొదలవుతున్నాయని చెప్పారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు దగదర్తికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా బృందాన్ని పరిశీలనకు పంపడం, ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు వెంటనే మొదలుపెట్టాలని ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామంగా చెప్పారు. ఇది ప్రారంభం అని, ఇక ఆగదని ఎంపీ అన్నారు. నెల్లూరు జిల్లాలో బిపిసిఎల్, ఇండోసోల్ వంటి పెద్దపెద్ద పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయని, మరిన్ని పరిశ్రమలు కూడా ముందుకొస్తున్నాయని, గ్రామస్థులకు ఇబ్బందులు లేకుండా పర్యావరణ నిబంధనలను మేరకు అనుమతులు ఇచ్చేలా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. కేంద్రంలోని మంత్రులను కలుస్తూ నిధుల మంజూరుకు సీఎం, డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎంలు కేంద్ర జల్‌శక్తి మంత్రిని కలిసి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కొళాయి కనెక్షన్లు మంజూరుకు, పోలవరం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. మన కూటమి ప్రభుత్వం ఎన్‌డిఏలో కీలకంగా వుండడంతోనే ఎయిర్‌పోర్టు పనులు ఇంత స్పీడ్‌గా మొదలవుతున్నాయని ఎంపీ చెప్పారు. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నెరవేరే సమయం ఆసన్నమైందన్నారు. దగదర్తి ఎయిర్పోర్ట్ ఏర్పాటుతో పారిశ్రామిక రంగానికి నెల్లూరు జిల్లా ఒక దిక్సూచిలా మరనుందన్నారు. 2019 జనవరి 6న సీఎం హోదాలో చంద్రబాబు విమానాశ్రయం ఏర్పాటుకు భూమి పూజ చేశారని, ఆ సమయంలో తాను కావలి ఇన్చార్జిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. మళ్లీ ఇప్పుడు తాను ఎంపీగా ఉన్న సమయంలో విమానాశ్రయం పనులు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు రెండేళ్లలోనే ఈ పనులన్నీ కూడా పూర్తయి విమానాశ్రయం అందుబాటులోకి వస్తుందని ఆయన చెప్పారు. రైతులందరూ కూడా తమ బిడ్డల భవిష్యత్తు కోసం భూములను ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని, ఎవరికి ఇబ్బందులు లేకుండా నష్టపరిహారం చెల్లించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టినట్లు ఎంపీ చెప్పారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ దగదర్తిలో విమానాశ్రయం ఏర్పాటుతో భారతదేశ పటంలో నెల్లూరు జిల్లా తలమానికంగా నిలవనుందని అన్నారు. 2019లో దగదర్తి విమానాశ్రయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారని, గత ప్రభుత్వం పూర్తిగా విమానాశ్రయాన్ని నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేక కృషి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు చొరవతో మళ్లీ ఎయిర్‌పోర్టు మొదలయ్యాయని చెప్పారు. రామాయపట్నం పోర్టు, కృష్ణపోర్టుకు అనుసంధానంగా దగదర్తిలో ఎయిర్‌పోర్టు నిర్మించాలని, జిల్లాలో పారిశ్రామి ప్రగతి సాధించాలనే గొప్ప లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు చర్యలు చేపట్టారని చెప్పారు. డిపిఆర్‌లు తయారుచేసి 96 కోట్ల నిధుల విడుదలకు కూడా సీఎం ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. రైతులందరూ కూడా తమ బిడ్డల భవిష్యత్, ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం తమ భూములను ఇచ్చేందుకు సిద్ధంగా వున్నారని చెప్పారు. ఎయిరిండియా అధికారులు టెండర్లు, డిపిఆర్ మొదల్కెన ప్రక్రియలను పూర్తి చేయాలని కోరారు. అన్ని పనులు పూర్తయితే త్వరలోనే కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ దగదర్తిలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రక్రియ మొదలుపెట్టినట్లు చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటు పరిశీలనకు ఢిల్లీ నుంచి విచ్చేసిన కేంద్ర బృందానికి జిల్లా యంత్రాంగం తరఫున పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటుకు ఎంపీ ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 1400 ఎకరాల భూములు అవసరం కాగా, ఇప్పటికే 700 ఎకరాల భూసేకరణ పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన భూసేకరణ ప్రక్రియను కూడా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నష్టపరిహారం చెల్లించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. విమానాశ్రయం ఏర్పాటుకు రైతులందరూ కూడా సహకరించి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఫిబ్రవరి 21)

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విజయవాడ వందే భారత్ ఎక్స్ ప్రెస్‌లో శుక్రవారం సాయంత్రం నెల్లూరు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. నాదెండ్ల మనోహర్‌కి టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ బాబు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి, డి.ఎస్.పి లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రంగయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అభిమానులు అధికారులు, పెద్ద ఎత్తున పాల్గొని ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోడ్డు మార్గమున ఆర్ అండ్ బి అతిథి గృహమునకు చేరుకున్నారు.





# హైస్కూల్లో ఘనంగా మాతృభాష దినోత్సవ కార్యక్రమం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, ఫిబ్రవరి 21)

మండల కేంద్రమైన ఉలవపాడు జీవీఎస్ఎమ్ ప్రభుత్వ హైస్కూల్ నందు శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పద్యాలు, కథలు, పాటలు, ప్రసంగాలతో పలు కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు అందరూ ఎంత ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు కె శివ నాగేశ్వరరావు, భాషా పండితులు సిహెచ్ భాస్కర్, ఎన్ ఉమామహేశ్వరి, తదితరులు నిర్వహించారు.

# ఆక్రమణలు తొలగించిన సిబ్బంది



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

కొప్పోలు రోడ్డులోని పులి వెంకట రెడ్డి కాలనీ దగ్గర గల సుమారు 20 అడుగుల ఆర్‌అండ్‌బి వారి రోడ్ ఆక్రమణకు సంబంధించిన కంప్లైంట్ 100, 2020 బీ1 గురించి గౌరవ లోకాయుక్త ఈ నెల 25వ తేదీన ఇచ్చిన ఆదేశముల ప్రకారం, సదరు ఆక్రమణలు తొలగించుటకు సంబంధిత ఆక్రమణదారులకు రెవిన్యూ డిపార్ట్మెంట్ వారి ద్వారా ఫారం 7 , ఫారం 6 నోటీసులుకు సదరు ఆక్రమణదారులు నుండి ఎటువంటి సంజాయిషీ లేనందువల్లన శుక్రవారం ఒంగోలు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఆర్‌అండ్‌బీ రెవిన్యూ డిపార్ట్మెంట్ అధికారుల ఆధ్వర్యంలో సదరు ఆక్రమణలను జేసీబీ, ఇతర మెషినరీ ద్వారా తొలగించారు. ఒంగోలు నగర్ పాలక సంస్థ కమీషనర్ కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొప్పోలు ఫ్లైఓవర్ దాటినా తరువాత అక్కడ కాలువలు లేకపోవటం వల్ల మురుగు నీరు, వర్షపు నీరు రోడ్డుపై నిలబడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువలన సదరు ఆక్రమణలు తీసివేయటం ద్వారా మెయిన్ రోడ్ లో కాలువను 15వ ఫైనాన్స్ నిధుల ద్వారా సుమారు 2 కోట్ల రూపాయలు వెచ్చించి ప్రధాన కాలువని నిర్మించి మురుగునీటి నిలవకుండా శాశ్వత పరిష్కారం చేసి అక్కడి ప్రజలు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు.







# భైరవకోనలో శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర



(షణ్ముఖ వెలుగు, పామూరు, ఫిబ్రవరి 21)

శివరాత్రి పర్వదినం రోజు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చేపట్టవలసిన పనులు ఎలా జరుగుతున్నాయని శుక్రవారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాగునీటి సౌకర్యం భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా ఎక్కడికి అక్కడ టెంట్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# ఘనంగా తేళ్ళ అరుణ “శునకరాగాలు” ఆవిష్కరణ

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకల్లో ఆవిష్కరించిన మేయర్ గంగాడ సుజాత



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

స్థానిక ఒంగోలులోని యన్.టి.ఆర్ కళాక్షేత్రం, ఆర్.డి.ఓ ఆఫీస్ ప్రాంగణం నందు శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కళామిత్రమండలి ( తెలుగు లోగిలి)సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సభకు సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఒంగోలు నగర మేయర్ శ్రీమతి గంగాడ సుజాత ముందుగా జ్యోతి ప్రకాశనం చేసి ,తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసిన అనంతరం నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం)గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ రచించిన”శునకరాగాలు “గ్రంథాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరించి మాట్లాడుతూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించడం వలన మనం ప్రతి ఏటా మాతృభాషా దినోత్సవ కార్యక్రమాన్ని జరుపుకుంటూ ఉన్నామని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చిన్న,పెద్ద భాషలు అన్నిటినీ రక్షించుకున్నప్పుడు మాత్రమే మనం భాషా సాంస్కృతిక వైవిధ్యంతో పాటు జీవవైవిధ్యాన్ని కాపాడుకో వచ్చునని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్ కుమార్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు మాతృభాషపట్ల పట్టు సాధించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పుస్తక రచయిత్రి శ్రీమతి తేళ్ళ అరుణ తాను రచించిన “శునకరాగాలు” గ్రంథాన్ని జంతు ప్రేమికుడైన తన పెద్ద కుమారుడు అరుణా సికిందర్ కు అంకితమిచ్చారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ జంతువుల పెంపకం గురించి, వాటిని చేరదీసి పెంచితే అవి మనుషుల పట్ల చూపే అవ్యాజమైన ప్రేమానురాగాలు, విశ్వాసం గురించి సంక్షిప్తంగా వివరించారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న జనసేన నాయకులు,రవి శంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్ మాట్లాడుతూ ప్రాంతీయ భాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడంతోపాటు,పిల్లలో చిన్నప్పటి నుంచే మాతృభాష పట్ల మమకారాన్ని,అనురాగాన్ని, అనురక్తిని కలిగించేందుకు ప్రయత్నించాలని సూచించారు. అరుణ రచించిన “శునక రాగాలు” గ్రంథాన్ని గూర్చి నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి సమీక్షించారు. సాహితీ పోషకులు వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య),నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, చందనకవి పోతుల పెదవీరనారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, సాహితీ పోషకులు ఓరుగంటి ప్రసాద్ తదితరులు అందరూ వారి వారి ప్రసంగాలలో మాతృ భాషల అభివృద్ధికి ప్రభుత్వం తోపాటు, తల్లిదండ్రులు, విద్యార్థులు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందని ముక్తకంఠంతో తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం కర్నూలు జిల్లా రచయిత గద్వాల సోమన్న బాలల కోసం రచించిన “పిల్ల తెమ్మెరల అను గేయ గ్రంథాన్ని కూడా అతిథుల చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనేక రంగాల్లో కృషి చేస్తున్న వివిధ జిల్లాల కవులు, కళాకారులు, సామాజిక సేవారంగ ప్రముఖులకు తెలుగు భాషా విశిష్ట సేవా సత్కారం చేశారు. అనంతరం వ్యాస రచన,వేషధారణ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సభకు ముందుచందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన నృత్యాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కోవెలకుంట్ల బాలకోటయ్య, బీరం అరుణ,జి.వి.శేషగిరిరావు, మహతి తన్నీరు బాలాజీ, కందుల మధు తదితరులు నిర్వహణ సహకారాన్ని అందించారు.

**తెలుగు భాషా విశిష్ట సేవా సత్కార గ్రహీతలు :** సయ్యద్ నజ్మా షమ్మీ, అప్పలాపురం భారతి, తోట సులోచన కూని అంకబాబు (నెల్లూరు), చంద్రమౌళి నాగమహాలక్ష్మి (ఏలూరు), పింగళి భాగ్యలక్ష్మి, యక్కంటి పద్మావతి, ప్రత్తిపాటి సుభాషిణి, నల్లాంచక్రవర్తుల సుధా మైథిలి (గుంటూరు), సామినేని శైలజ, ఆలపాటి సత్యవతి, వాసాల ఉమామహేశ్వరి(విజయవాడ) గొట్టుముక్కల నాసరయ్య(త్రిపురాంతకం) చంద్రమౌళి, నాగమహాలక్ష్మి (ఏలూరు) యు వి రత్నం, యస్.వి శివకుమారి మిడసల మల్లికార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, శింగరాజు శ్రీనివాసరావు, గౌరిజవోలు వెంకట రామయ్య, నూకతోటి శరత్ బాబు, నాళం నరసమ్మ, డాక్టర్ సిహెచ్ ఉదయజానకి లక్ష్మీ, ఏల్చూరి అనంత లక్ష్మి, కమ్మి శెట్టి శైలజ, డాక్టర్ తిమ్మిరి రవీంద్ర, పాలూరి శివ ప్రసాద్, చుండూరి శ్రీనివాసరావు (ఒంగోలు), దాసరి ఝాన్సీరాణి (మార్కాపురం), బీరం అరుణ, చిరుతోటి బాలకోటయ్య (లింగసముద్రం) ఉన్నారు.





# బాలల హక్కులు కాపాడడం అందరి బాధ్యత

## ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఫిబ్రవరి 21)

బాలల హక్కులు కాపాడడం అందరి బాధ్యత అని ఆర్‌డిఓ కేశవ వర్ధన్‌రెడ్డి అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంపై శుక్రవారం కనిగిరి డివిజన్ రెవిన్యూ ఆఫీసులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా బంగారు బాల్యం కార్యక్రమంపై వివిధ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ డి ఓ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలందరికీ విద్య వైద్యంతో పాటు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంగా బంగారు బాల్యం కమిటీలు పనిచేస్తున్నాయని అన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అప్పుడే డ్రాపౌట్ ను తగ్గించవచ్చని అన్నారు.వెట్టి చాకిరి నిర్మూలనలో భాగంగా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే ప్రయత్నం చేయాలని అన్నారు.ఈ మధ్యకాలంలో ముందస్తుగా బాల్య వివాహాలు నిలిపివేసినందుకు బంగారు బాల్యం కమిటీ సభ్యులను అభినందించారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న వివాహాలను నమోదు చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో కిశోర బాలికల క్లబ్‌లు ఏర్పాటు చేసి పౌష్టికాహారం,సామాజిక రుగ్మతల, ఆరోగ్యం మీద అవగాహన కల్పించాలన్నారు. బంగారు బాల్యం ప్రోగ్రాంలో 0-18 లోపు పిల్లల సర్వేకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాలల హక్కులకు భంగం కలిగిస్తే ఎవరిని వదిలిపెట్టేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు,స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి బంగారు బాల్యం, మిషన్ శక్తి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారుల పై టైమ్ ఆఫ్ డే విధానం వెంటనే ఆపాలి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

విద్యుత్ సంస్కరణల అమల్లో భాగంగా చార్జీలు పెంచడం లేదంటూ వినియోగదారులు జేబులు కాళీ చేసే విధానానికి రాష్ట్ర ప్రభుత్వం తరలిపోయింది. వినియోగదారుల పిక్ కవర్ అవసరాలపై చార్జీలు పెంచుతున్నది. తప్పనిసరిగా విద్యుత్ వినియోగించాల్సిన సమయాల్లో చార్జీలు పెంచడానికి వ్యతిరేకిస్తున్నది.. నిన్న జరిగిన విద్యుత్ నియంత్ర మండలి ఈ టైం అప్డే విధానం ఇక నుంచి చిరు వ్యాపారుకు కూడా అమలు చేస్తానని చెప్పింది .రానున్న కాలంలో గృహ వినియోగదారులు కూడా బిగిస్తారు.. విద్యుత్ రంగంలో సంస్కరణలు చేసే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సాహాలను రాయితీలు ఇస్తున్న నేపథ్యంలో రాజాగా పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యుత్ సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలు ప్రత్యేక రుణాలతో పాటు పలు రాయితీలు ప్రకటించింది. మరోవైపు విద్యుత్ సంస్కరణలకు ఆజ్ఞుడనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెప్పుకుంటూ సంగతి తెలిసిందే.. సంస్కరణలు భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు టైమ్ ఆఫ్ డే విధానం అమలు ఈ విధానం త్వరలో చార్జీలు గృహ వినియోగదారులు తలుపు తట్టడానికి ఎక్కువ సమయం పట్టదు.. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి విధంగా అమలు చేసే విధంగా వార్షిక నివేదికలో విద్యుత్ పంపిన సంస్థ ప్రతిపాదించాయి. దీని ప్రకారం ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు సాయంత్రం 6:00 నుంచి 10:00 వరకు పీ కవర్ ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు, రాత్రి 12 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆఫ్ పిక్ అవర్గా ఉంటుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 6:00 వరకు రాత్రి 10:00 నుంచి 12:00 వరకు సాధారణ అవర్‌గా పరిగణిస్తారు.

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఫిబ్రవరి 21)

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాతృభాష గొప్పతనం గురించి కళాశాల డాక్టర్ బి. కళ్యాణి చక్కగా వివరించారు. అనంతరం తెలుగు సాక అధ్యక్షులు మాతృభాష గొప్పతనం గురించి వివరిస్తూ తెలుగు భాష తీయడం గురించి వర్ణించారు. అధ్యాపక బృందం తమ మూల్యమైన సందేశాలు అందించగా విద్యార్థులు చక్కని సాంస్కృతి ప్రదర్శనలు చేశారు. కుమారి అంజనా సాయి తేనెకన్నా తీయనిది తెలుగు అంటూ చక్కగా నాట్యం చేయగా, ఫస్ట్ బీకాం నుంచి కుమారి శ్రావణి సోది చెపుతానమ్మ అంటూ వచ్చి మాతృభాష మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని, సెల్ ఫోన్స్‌ని అనవసరంగా వాడవద్దని హాస్యస్ఫోరకంగా మంచి సందేశం ఇచ్చింది. ఫస్ట్ బిఏ నుంచి ఏమి మా అనూష వాళ్ళు తెలుగు భాష గొప్పతనం తెలుగు భాష తీయదనం అంటూ కమ్మని పాట పాడారు. అనంతరం ఫస్ట్ ఫైనల్ బీకాం నుంచి హారిక బై తన మాతృభాషణ లంబాడి భాషలో మాట్లాడుతూ అందరికి శుభాకాంక్షలు తెలిపింది. జాతీయ గీతాలాపనతో ఈ జయప్రదమైనది. ఈ సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.కళ్యాణి మేడం, తెలుగు శాఖ అధ్యక్షుడు పి యామిని, అమ్మాజీ భౌతిక శాస్త్ర అధ్యక్షులు డాక్టర్ ఇందిరా, సుష్మ, తదితర అధ్యాపక ,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. సురేష్ సాంకేతిక సహకారం అందించారు.

# బండిపై వెళ్తూ ఆదమరిస్తే అంతే సంగతులు







(షణ్ముఖ వెలుగు, కొండపి, ఫిబ్రవరి 21)

కొండపి నుంచి టంగుటూరు ఆర్ఎంపి ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతూ ఉంటాయి కొండపి గురుకుల పాఠశాల దగ్గర గురుకుల పాఠశాలకు మంచినీటి పైపు కోసం ఆర్అండ్‌బి రోడ్డు పగలగొట్టి పైపులు వేశారు. పంచాయతీ అధికారి మాత్రం గుంటలు పోచడం మరిచిపోయారు. అక్కడ నుంచి కొంచెం దూరం వెళ్తే రంగ సాయి వాగు మలుపు దగ్గర పొలాలకు వర్షపు నీరు అట్లేరులోకి ఆర్అండ్‌బి రోడ్డు క్రిందగా వెళ్లడానికి సప్త ఏర్పాటు చేశారు. సప్త పై అడుగు మీద పగిలి వుంది తరచూ ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకోని ఆర్అండ్‌బి అధికారులు ఇకనైనా స్పందించి ఆర్ఎంబి రోడ్డు పై గుంతలు లేకుండా రోడ్డు బాగు చేయాలని కొండపి ప్రజలు కోరుతున్నారు.

# రైతులకు మేలు జరిగే విధంగా ప్రయత్నం చేస్తాం

## గ్రామ సభలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, ఫిబ్రవరి 21)

గుడ్లూరు మండలం రావూరు గ్రామ సచివాలయంలో ఈరోజు అనగా శుక్రవారం సాయంత్రం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్, సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ.. గత వైసిపి ప్రభుత్వం లో కనీసం గ్రామసభ నిర్వహించకుండా రైతులు అభిప్రాయాలు తీసుకోకుండా భూసేకరణ ధర నిర్ణయం చేశారని, కానీ కూటమి ప్రభుత్వం ఆ గ్రామంలో ఉన్న ప్రజలతో గ్రామసభ నిర్వహించి వారి అభిప్రాయాలు అనుగుణంగా పనిచేస్తుందని తెలిపారు. రామాయపట్నం పోర్ట్ రావడం మన అదృష్టం. సింగరాయకొండ ఎస్ఆర్వో రేట్ల ప్రకారం ధర నిర్ణయించడం సబబు కాదని తెలిపారు. మీ అభిప్రాయాలను తెలుసుకుని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ముఖ్యమంత్రి రైతుల పట్ల నిబద్ధతతో ఉన్నారు. రైతులకు అందించే పరిహారం విషయంలో రైతుల నష్టపోకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళతానన్నారు. రైతులు భూ సమస్యలపై దూర ప్రాంతాలు ప్రయాణించకుండా వీఆర్వో లు, ఆర్ఐలు, అధికారులు గ్రామంలో వుండే రైతులు సమస్యలు పరిష్కరిస్తారని ఎమ్మెల్యే తెలిపారు.







On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com